


VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

విలేఖరులు కావలెను
రాజమండ్రి, చాగల్లు, నిడదవోలు, దేవరపల్లి మండలాలకు విలేకరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్: 9100986584, 9553574250

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 185 విశాఖపట్నం, 4 మే 2025 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.5.00



## అమరావతి అభివృద్ధితో ఎపికి మహర్దశ

- ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు
- ఎపి అభివృద్ధిలో బాగస్వామ్యం కావడంపై మోడీ హర్షం

**అమరావతి (విశాఖ సమాచారమ్) :** ప్రజల సహకారం, కేంద్ర మద్దతు, పక్కా ప్రణాళికతో అమరావతిని నిర్మిస్తామని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. భారత్ ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా పునర్నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం జరిగిందని అన్నారు. పునర్నిర్మాణ పనుల ప్రారంభం విజయవంతంపై ఎక్స్ లో సిఎం స్పందించారు. కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియా, సోషల్ మీడియాకు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదకశక్తిగా నిలిచేలా నిర్మాణం జరుగుతుందని చెప్పారు. తమకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతి పునః ప్రారంభంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఏపీ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ లో ప్రధాని ఇలా రాసుకొచ్చారు.. అమరావతి అభివృద్ధిలో నూతన, చారిత్రాత్మక అధ్యాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని ...(మిగతా 2లో)

## మానవాళి మనుగడకు ఉగ్రవాదం ప్రమాదకరం



**న్యూఢిల్లీ :** మానవాళి మనుగడకు టెర్రరిజం అతి ప్రమాదకరమైనదని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు అని ప్రధాని మోదీ అన్నారు. దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భారత పర్యటనలో ఉన్న అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సోతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. అనంతరం వీరిద్దరూ కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను మోదీ ప్రస్తావించారు. రెండు దేశాలు ఉగ్రవాదం తగదని నమ్ముతున్నాయి. టెర్రరిజాన్ని సపోర్టు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న దృఢనిశ్చయంతో ఉన్నాము. సరిహద్దుల దగ్గర టెర్రరిజాన్ని అరికట్టడంతో మాకు సహకరిస్తున్నందుకు అంగోలాకు కృతజ్ఞతలు అని ప్రదాని తెలిపారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు. పహల్గాం దాడి నేపథ్యంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి అంగోలా మద్దతు పలికింది. అందుకు ఆ దేశానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారిపై కఠినమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి మేం కట్టుబడి ...(మిగతా 2లో)

**దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం**

**దానికి సహకరించేవారిని కూడా వదిలిపెట్టం**

**మరోఆరు ఘాటు హెచ్చరిక చేసిన ప్రధాని మోడీ**

**అంగోలా అధ్యక్షుడి పర్యనటతో సంయుక్త మీడియాసమావేశం**

## అమరావతి పునర్నిర్మాణం ఓ పెద్ద మైలురాయి

రాజధాని రావడం వైకాపాకు ఇష్టం లేదు

ఇప్పటికైన ప్రజలకు క్షమాపణ చెబితే మేలు

మీడియా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి



## దేశ సమ్మిళిత సామాజికాభివృద్ధి కోసమే జనగణనలో కులగణన!

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్




వివరాలు 2వ పేజీలో

## చంద్రబాబూ.. రైతుల గోడు వినిపించడం లేదా?



**వైఎస్ జగన్**

**తాడేపల్లి (విశాఖ సమాచారమ్) :** ఏపీలో రైతుల ఆందోళనలపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ స్పందించారు. కనీస మద్దతు ధరలు లభించక రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవ డదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. ఇది న్యాయమేనా? అని ప్రశ్నించారు. జిల్లాల్లో రైతులు ఆందోళనలు చేస్తుంటే, ఇప్పటికీ రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా..'చంద్రబాబు.. కనీస మద్దతు ధరలు లభించక రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా వారి గోడు పట్టించుకోవడం లేదు. కనీస మద్దతు ధరలు లభించక, పెట్టిన పెట్టుబడులూ రాక రైతులు అప్పుల ఊబిలోకి కూరుకు పోతున్నారు. మీరు, మీ మంత్రులు, యంత్రాంగం కనీసం వారివైపు కన్నెత్తికూడా చూడకపోవడం ధర్మమేనా? మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, వేరుశెనగ, టమోటా, అరటి, చీని, పొగాకు ఇలా ఏ పంట చూసినా కనీస మద్దతు ధరలు రావడం ...(మిగతా 2లో)

## సింహాచలం దుర్ఘటనకు అందరూ బాధ్యులే

- ఆలయ ఈవో, ఇంజినీరింగ్, టూరిజం కార్పొరేషన్ అధికారులదీ పాత్ర
- గోడ నిర్మాణానికి డిజైన్లు, అనుమతులూ లేవు
- షాపింగ్ కాంప్లెక్స్‌దీ ఇదే పరిస్థితి
- విచారణ కమిషన్ గుర్తించిన వాస్తవాలు ఇవి



**అమరావతి (విశాఖ సమాచారమ్) :** సింహాచలం ఆలయంలో చందనోత్సవం నాడు గోడ కూలి ఏడుగురు భక్తులు మరణించిన దుర్ఘటనలో పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్, దేవాదాయశాఖ, గుత్తేదారు అందరూ బాధ్యులేనని ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ఐఏఎస్ అధికారి సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ విచారణలో విస్తుగొలిపే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. చందనోత్సవ వేళ లక్షన్నర మంది భక్తులు వచ్చే ఈ ఆలయంలో పైనుంచి కింది వరకు సంబంధిత శాఖల అధికారులందరూ పూర్తిగా బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించినట్లు తేలింది. తప్పును ఒకరిపై మరొకరు తోసుకుంటున్నారు. తమ బాధ్యత లేదని తప్పించుకునేలా వాదనలు వినిపిస్తున్నారు. ఇక్కడ తొలి నుంచి ఇప్పటి వరకు చేసిన ఏ పనికీ సరైన అనుమతులు లేవని ఈ విచారణలో తేలింది. తాత్కాలిక గోడ నిర్మాణం అసలు ఎందుకు చేపట్టారు? ఎవరు అనుమతిచ్చారు? ఎవరు పర్యవేక్షించారు? అన్న విషయంలో అందరూ నీళ్లు నములుతున్నారు. అంతేకాదు ఇక్కడ షాపింగ్ కాంప్లెక్సు మూడు అంతస్తులు నిర్మించే ప్రణాళికకు ఎవరి అనుమతులూ లేకుండానే ప్రాథమిక పనులు చేసెయ్యడమూ గమనార్హం. ఇక్కడ జరిగిన లోపాలపై విచారణ కమిషన్ గుర్తించిన అంశాల్లో కొన్ని ఇవి.

**మూడు అంతస్తులకు ఎవరు అనుమతిచ్చారు?**

సింహాచలం ఆలయంలో పాత దుకాణాలను తొలగించి కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, యాంఫీ థియేటర్ వంటి పనులను రూ.54 కోట్లతో చేపట్టారు. కిందటేడాది జూన్‌లోనే ఈ పనులు ప్రారంభమయ్యాయి. పాత మెట్ల స్థానంలో కొత్త మెట్లు వచ్చాయి. ప్రతి ఏటా స్వామి ఉత్సవ విగ్రహాలను మూడు సార్లు కిందకు తీసుకువస్తారు. తాజా మార్పుల వల్ల స్వామి వారిని మలుపులు తిప్పుతూ తీసుకురావాల్సి వస్తోంది. ఇది సంప్రదాయానికి ...(మిగతా 2లో)



## సురేష్ ప్రొడక్షన్స్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురు

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీస్‌ను కొట్టేయడానికి నిరాకరణ

**ఢిల్లీ:** విశాఖపట్నం భూముల విషయంలో సురేష్ ప్రొడక్షన్స్ సంస్థకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మధురవాడలో రామానాయుడు స్టూడియో నిర్మాణం కోసం 2003లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమిలో కొంతభాగాన్ని రెసిడెన్షియల్ లేఅవుట్‌కు మళ్లించడాన్ని తప్పుపడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీస్‌ను కొట్టేయాలంటూ ఆ సంస్థ యాజమాన్యం దాఖలు చేసిన వ్యాజ్యకాలీన దరఖాస్తుపై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ అభయ్ ఎస్.ఓక, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర ...(మిగతా 2లో)

## పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- అధికారులతో సమీక్షించిన మంత్రి ఆనం



**నెల్లూరు (విశాఖ సమాచారమ్) :** పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్లను శనివారం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దర్శించుకున్నారు. పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పెంచలకొన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆనం ఆదేశాలు జారీచేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున చలువ పందిళ్లు ఏర్పాట్లు- చేయాలని అధికారులకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు. 12 రోజుల పాటు- కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు- చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. రెండు నెలల క్రితం పులి సంచరిస్తోందని సోషల్ మీడియాలో వచ్చిన నేపథ్యంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆనం ఆదేశించారు. ...(మిగతా 2లో)

## బెంగళూరులో ట్రాఫిక్ చిక్కులకు చెక్

మే 15ను అమల్లోకి ఎల్లో మెట్రో లైన్



**బెంగళూరు :** ఐటీ- పరిశ్రమ విస్తరణతో ఇండియన్ సిలికాన్ వ్యాలీగా గుర్తింపు తెచ్చుకున్న బెంగళూరులోని -టె-క్కీలను చాలా కాలంగా పీడిస్తున్న ట్రాఫిక్ విషయంలో శుభవార్త చెప్పింది. సరైన మెట్రో కనెక్టివిటీ లేకపోవటం కూడా చాలా మంది సొంత వాహనాలపై వెళ్లాల్సిన పరిస్థితిని కల్పిస్తోంది. అయితే ప్రస్తుతం బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ టెక్కీలకు ఒక శుభవార్తను ప్రకటించింది. చాలా కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న మెట్రో ఎల్లో లైన్ ...(మిగతా 2లో)

2nd pages11.qxd 5/3/2025 7:41 PM Page 2



# నమో దెబ్బకు.. పాకిస్తాన్ తోకముడవటం ఖాయం



**అమరావతి (విశాఖ సమాచారమ్) :** ప్రధాని నరేంద్ర మోదీ కొట్టే దెబ్బకు.. పాకిస్థాన్ తోకముడవటం ఖాయమని మంత్రి నారా లోకేష్ అన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునఃప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద దాడిలో చనిపోయిన కుటుంబాలకు నివాళులర్పించారు. ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉందన్నారు. పాకిస్తాన్ గీత దాటి, అమాయకులని చంపి చాలా పెద్ద తప్పు చేసిందన్నారు. ఒక్క పాకిస్తాన్ కాదు.. వంద పాకిస్తాన్‌లు వచ్చినా కూడా భారతదేశ నేలపై మొలిచిన గడ్డి కూడా పీకలేవని చెప్పారు. వంద పాకిస్తాన్‌లకు సమాధానం చెప్పగలిగే ఒక్క మిస్సైల్ మన దగ్గర ఉందని, ఆ మిస్సైల్ నరేంద్ర మోదీ అని కొనియాడారు. సింహం ముందర ఆటలు ఆడకూడదు.. ఆడితే మన సింహం నమో కొట్టే దెబ్బకు వరల్డ్ మ్యాప్‌లోనే పాకిస్తాన్ మిస్సింగ్ కావడం ఖాయమన్నారు. పాకిస్తాన్ ఆర్మీలో పని చేసే వారు కొంతమంది రాజీనామాలు చేశారని, మరికొంతమంది సెలవులో వెళ్లిపోయారని చెప్పారు. అది నరేంద్ర మోదీ పవర్ అంటూ కొనియాడారు. ప్రపంచం మొత్తం ప్రధాని మోదీకి మద్దతు ఇస్తోందన్నారు.

కేంద్రం కులగణన చేయాలని నిర్ణయం తీసుకుందని.. ఇది నిర్ణయం కాదని, ఇది ఒక సంచలనమని మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రధాని మోదీకి ఆంధ్రప్రదేశ్ అన్నా... అమరావతి అన్నా ఎంతో ప్రేమ అని అన్నారు. అందుకే ప్రధాని ఢిల్లీలో ఎంతో బిజీగా ఉన్నా కూడా కార్యక్రమానికి హాజరయ్యారని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని 94 సీట్లతో ప్రజలు గెలిపించారని, అందుకే ప్రధాని మోదీ.. ఆంధ్రప్రదేశ్ కోరిన అన్ని కోరికలనూ తీరుస్తున్నారని చెప్పారు. ఇటీవలే విశాఖపట్నంలో రైల్వే జోన్, ఎన్టీపీసీ గ్రీన్ ప్రాజెక్ట్, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్‌కు నిధులు కేటాయించారని గుర్తు చేశారు. అలాగే విశాఖ ఉక్క ఫ్యాక్టరీని కూడా కాపాడారని తెలిపారు. ఇప్పుడు అమరావతికి వచ్చి నిధులే కాకుండా.. పనులు కూడా ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. వైసీపీ పాలనలో వ్యక్తిగత కక్షతో అమరావతిని చంపేయాలని చూశారని మంత్రి నారా లోకేష్ అన్నారు. వైసీపీ పాలనలో అమరావతిలో ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. జై అమరావతి అన్నందుకు గతంలో బయట తిరగలేని పరిస్థితి ఉండేదని చెప్పారు. ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన అమరావతిని ఎవరూ ఆపలేరని తెలిపారు. ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమ కార్యక్రమాలు ఆపలేదని నారా లోకేష్ పేర్కొన్నారు.

# ఆఫ్ఘనిస్తాన్‌లో 4.3 తీవ్రతతో భూకంపం



**కాబూల్ :** ఆఫ్ఘనిస్తాన్‌లో శనివారం భూకంపం సంభవించింది. ఈ భూకంప తీవ్రత 4.3గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సిఎస్) వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. శనివారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటల సమయంలో ఆఫ్గనిస్తాన్‌లో భూప్రకంపనలు సంభవించాయి. వెడల్పు : 36.52, పొడవు : 71.20, 15 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు ఎన్‌సిఎస్ ఎక్స్ పోస్టులో పేర్కొంది.

# అమరావతి పునర్నిర్మాణం ఓ పెద్ద మైలురాయి

**- రాజధాని రావడం వైకాపాకు ఇష్టం లేదు- ఇప్పటికైన ప్రజలకు క్షమాపణ చెబితే మేలు**
**- మీడియా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి**

**విజయవాడ :** ఏపీ రాజధాని అమరావతి అంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి కడుపు మంట అంటూ మంత్రి కొలుసు పార్థసారథి ఫైర్ అయ్యారు.. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన.. అమరావతి రీలాంచ్ కార్యక్రమంపై స్పందిస్తూ.. రాజధాని పునఃప్రారంభ పనులు గొప్పగా మొదలయ్యా యన్నారు.. అమరావతిపై విషం చిమ్మిన స్వార్థపరులు ఇప్పటికైనా పశ్చాత్తాపం వ్యక్తం చేయాలని సూచించారు.. అలా చేస్తే.. తెలుగు ప్రజలు క్షమించక పోయినా.. దేవుడు వారిని క్షమిస్తారని వ్యాఖ్యానించారు.. ఇక, అమరావతి రీలాంచ్ సభకు వచ్చేందుకు వాహనాలు సరిపోక వేలమంది గ్రామాల్లో ఉండిపోయారని తెలిపారు.. సభలో సీఎం చంద్రబాబు నాయుడు పనితీరుపై ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంపై ఆయనకు ఉన్న కమిట్‌మెంట్‌ను తెలియజేస్తాయన్నారు పార్థసారథి.. అమరావతి శక్తిని సాక్ష్యాత్తు ప్రధాని మోడీ గుర్తించి కీర్తించారు.. అమరావతి దేవతల రాజధాని అని మోడీ పేర్కొన్నారని గుర్తుచేశారు.. కానీ, అమరావతి భ్రమరావతి అని గత పాలకులు వ్యాఖ్యానించారని మండిపడ్డారు.. గత పాలకులు అమరావతి ప్రాధాన్యతను అవసరాన్ని ఇప్పటి-కై-నా గుర్తించాలని సూచించారు.. ఇక, అమరావతి సభ సమయంలో అగ్ని ప్రమాదం వెనుక ఎవరైనా ఉంటే దానిపై పోలీసులు విచారణలో గుర్తిస్తారని తెలిపారు. అమరావతిని రాజధానిగా రాష్ట్ర ప్రజలు గుర్తించారు.. వైసీపీ గుర్తించాల్సిన అవసరం లేదు.. గుర్తించాలానే ఆలోచన విధానం వారికి లేదన్నారు.. అమరావతి అంటే వైసీపీకి కడుపు మంట అంటూ ఫైర్ అయ్యారకు.. మరోవైపు.. అమరావతికి చట్ట బద్దత కల్పించే అంశంపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటు-ందని తెలిపారు మంత్రి కొలుసు పార్థసారథి..

# సింహాచలం దుర్ఘటనకు అందరూ బాధ్యులే

(మొదటి పేజీ తరువాయి)

విరుద్ధమని పురోహితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో పనులు ఆలస్యమయ్యాయి. రాష్ట్ర స్థపతి తదితరులను పిలిచి వారి పరిశీలన తర్వాత పనులు చేపట్టాలనే భావనతో ఈ పనులు ఆలస్యమయ్యాయి.

షాపింగ్ కాంప్లెక్స్ మొదట ఒక అంతస్తు మాత్రమే నిర్మించాలనేది పర్యాటక కార్పొరేషన్ ఆలోచన. ఆలయ అధికారులు తమ నిధులతో మూడు అంతస్తులు నిర్మించుకుంటామని అందుకు తగ్గట్టుగా పునాది పనులు చేయాలని కోరారు. మూడు అంతస్తులు నిర్మించాలంటే కమిషనర్, కార్యదర్శి స్థాయిలో అనుమతులు తీసుకోవాలి. ఆ అనుమతులు లేకుండానే మూడు అంతస్తులకు అవసరమైన ప్రాథమిక పనులు చేశారు. ఈ కారణాల వల్ల పనులు ఆలస్యం కావడంతో ఇక్కడ గోడ నిర్మాణం, ఇతర పనులు చందనోత్సవాల్లోపు పూర్తి చేయలేమని అక్కడి ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారు చెప్పేశారు. అయితే అక్కడ నిర్మాణాలు మధ్యలో ఆగడం, మట్టి ఉండటం, చూడటానికి బాగోలేదని అక్కడ తాత్కాలికంగా గోడ కట్టాలని ఆలయ అధికారులు కోరారు. దీంతో ఈ గోడ నిర్మాణం చేపట్టారు.

ఈ గోడ నిర్మాణానికి సంబంధించి సెక్షన్ ఇంజినీరింగ్ అధికారులు ఎవరూ అనుమతి ఇవ్వలేదు. ఆలయ అధికారులు నిర్మించాలని కోరినట్లు టూరిజం కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. అయితే తమకు సంబంధం లేదని ఆలయ అధికారులు అంటున్నారు. అక్కడ ఆ గోడ నిర్మాణాన్ని పర్యవేక్షించిన ఇంజినీరింగ్ నాథుడెవరూ లేరు. కాంట్రాక్టర్ తాత్కాలిక గోడ నిర్మించుకుంటూ వెళ్లారు. దీనికి ఆకృతులు లేవు. ఆమోదం లేదు. పునాదులు లేవు. ఏ జాగ్రత్తలూ తీసుకోలేదు. ఆ గోడ నిర్మించకపోయినా భక్తుల దర్శనానికీ.. క్యూ లైన్లకూ ఎలాంటి ఇబ్బందీ ఉండదు. పైగా క్యూలైన్ల నిర్మాణంలో పిల్లర్లు, పైన వేసిన రేకులు ఆ గోడ మీదకు వేశారు. ఆ బలమూ గోడపై పడింది. నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా గోడకు పెట్టాల్సిన వీప్‌హోల్స్ (రంధ్రాలు) ఏర్పాటు చేయలేదు. కాంట్రాక్టరు కూడా తాను ఇంకా ఆ పని పూర్తి చేయలేదని, వారికి అప్పగించలేదని, కట్టడం పక్కాగా నిర్మించలేదని, తన బాధ్యత ఏమీ లేదని చెబుతున్నారు. ఆలయంలో కార్యనిర్వహణాధికారి, ఇంజినీరింగ్ విభాగంలో ఈఈ, డీఈ, జేఈలు ఉన్నారు. వారూ తమకు సంబంధం లేదంటున్నారు. టూరిజం కార్పొరేషన్‌లో ఇంజినీరింగు డివిజన్ ఉంది. వాళ్లూ ఆలయ ఈవో చెప్పినందున తాత్కాలికంగా నిర్మించినట్లు చెబుతున్నారు. క్యూలైన్లు, భక్తుల భద్రతను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఆలయ అధికారులదే. ఇక్కడ ఈ నిర్మాణాన్ని పరిశీలించాల్సిన బాధ్యత వారిపై ఉంది. మరి ఎందుకు సరిగా పరిశీలించలేదన్న విచారణాధికారుల ప్రశ్నకు వారు సమాధానం చెప్పడం లేదు. విచారణ కమిషన్ అందరి నుంచి లిఖిత పూర్వకంగా వివరాలు తీసుకుంది.

## దేశ సమ్మిళిత సామాజికాభివృద్ధి కోసమే
# జనగణనలో కులగణన!

**బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్**

**విశాఖపట్నం (విశాఖ సమాచారమ్):** దేశ సమ్మిళిత సామాజికాభివృద్ధి కోసమే జన గణనలో కుల గణన చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయం తీసుకున్నారని రాజ్యసభ బిజెపి సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. శనివారం లాసన్స్ బే కాలనీలోని నగర బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ సమగ్రమైన కుల గణన వల్ల దేశంలోని కులాల వారీగా సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను కూలంకుషంగా తెలుసు కోవచ్చున్నారు. బ్రిటిష్ కాలంలో ప్రవేశ పెట్టిన ఈ విధానాన్ని 1951వ సంవత్సరంలో అప్పటి ప్రధానిగా ఉన్న జవహర్లాల్ నెహ్రూ దీనికి స్వస్తి పలికా రన్నారు. ఆ విధంగా బీసీ వ్యతిరేక విధానాలతో వారి హక్కులను అన్యాయంగా కాలరాసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బీసీల కోసం మొసలి కన్నీరు కార్చుతూ కపట నాటకాలాడు తోందన్నారు. అంబేద్కర్ న్యాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు జాతీయ స్థాయిలో బీసీ కమిషన్ను ఏర్పాటు చేసి దానికి రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలని ప్రతిపాదించగా కాంగ్రెస్ పార్టీ పట్టించు కోలేదన్నారు. మండల్ కమిషన్ నివేదికను పార్లమెంట్ ముందుకు రాకుండా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ త్రొక్కిపెట్టా రన్నారు. ప్రస్తుత ప్రధాని మోడీ 2018వ సంవత్సరంలో జాతీయ బీసీ కమిషన్ కు రాజ్యాంగ హోదా కల్పించా రన్నారు. అమరావతి పునర్నిర్మాణ పనులకు హాజరైన ప్రధాని ఉత్తరాంధ్రలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అమలు చేయడం కోసం మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో వేసిన కమిటీ రిపోర్ట్ ను సమగ్రంగా అధ్యయనం చేస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజక వర్గానికి చెందిన నలుగురు కార్యకర్తలకు పార్టీ కండువా వేసి బిజెపిలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో బీజేపీ నగర అధ్యక్షుడు ఎం.ఎం.ఎన్.పరశురామ రాజు, మాజీ ఎమ్మెల్సీ పీ.వీ.ఎన్.మాధవ్, బీజేపీ మహిళా నాయకురాలు సుహాసిని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మానవాళి మనుగడకు ఉగ్రవాదం ప్రమాదకరం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాం అని మోదీ పునరుద్ఘాటించారు. ఇటీవల బిహార్‌లో జరిగిన కార్యక్రమంలోనూ మోదీ పహల్గాం దాడి గురించి ప్రస్తావిస్తూ గట్టి హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా అని అన్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టు-ముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వం .. ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పే దిశలో చర్యలు మొదలెట్టింది. సరిహద్దుల దగ్గర యుద్ధ వాతావరణం నెలకొంది. ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాదం గురించి తరచుగా స్పందిస్తూనే ఉన్నారు. శనివారం కూడా ప్రధాని మోదీ ఉగ్రవాదంపై మాట్లాడారు. ఉగ్రవాదులపై .. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అంగోలా ప్రెసిడెంట్ జావో లూరెన్కో రాక సందర్భంగా ఆయనతో ఢిల్లీలో ఉమ్మడి ప్రెస్ కాన్ఫిరెన్స్ జరిగింది. ఈ ప్రెస్ కాన్ఫిరెన్స్ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. దాదాపు రెండు దేశాలు 40 ఏళ్లుగా భాగస్వామ్యంలో కలిసి ముందుకు నడుస్తున్నాయి. అంగోలా స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నపుడు.. ఇండియా నమ్మకం, స్నేహంతో అండగా నిలిచింది. ఆఫ్రికన్ దేశాల నుంచి మాకు గత పదేళ్లు ఎంతో వేగవంతమైన సహకారం అందింది. వ్యాపారం 100 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఎనిమిది దేశాల్లో ఒకేషనల్ -ట్రైనింగ్ సెంటర్లను తెరిచాము. ఓ ఐదు దేశాల్లో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణంలో సహకరిస్తున్నాం.. ఆఫ్రికాలో 17 కొత్త ఎంబసీలను తెరిచామని అన్నారు

# ఉగ్రవాదులు, వారి మద్దతుదారులపై కఠిన చర్యలు: పహల్గాం దాడిపై మోదీ వ్యాఖ్యలు

**ఢిల్లీ:** ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు అని ప్రధాని మోదీ అన్నారు. దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భారత పర్యటనలో ఉన్న అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సోతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. అనంతరం వీరిద్దరూ కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను మోదీ ప్రస్తావించారు. "ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు. పహల్గాం దాడి నేపథ్యంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి అంగోలా మద్దతు పలికింది. అందుకు ఆ దేశానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారిపై కఠినమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని మోదీ పునరుద్ఘాటించారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

## సురేష్ ప్రొడక్షన్స్‌కు
# సుప్రీంకోర్టులో చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఏప్రిల్ 7న జారీ చేసిన షోకాజ్ నోటీస్‌ను సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ వ్యతిరేకించడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నోటీసిస్తే.. దాన్ని చట్టబద్ధంగా సవాల్ చేసుకోవచ్చని ఆ సంస్థ తరఫున వచ్చిన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సూచించింది. విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌లో మధ్యంతర ఉపశమనం కోరడం చెల్లదని స్పష్టం చేసింది. అభిషేక్ సింఘ్వీ బదులిస్తూ 2024 జనవరి 19న సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల్లో స్టూడియో నిర్మించిన 17 ఎకరాలను మినహాయించి, మిగిలిన భూమిని యథాతథంగా ఉంచాలని పేర్కొందని గుర్తుచేశారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రామకృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌లోని అంశాలను అనుసరించే షోకాజ్ నోటీసు జారీ చేసిందన్నారు. కోర్టు చెప్పిన 17 ఎకరాలు మినహాయించి మిగిలిన భూమిలో తాము ఎలాంటి పనులూ చేపట్టలేదని, అందుకు సంబంధించిన ఫొటోలు కూడా జత చేశామని చెప్పారు. ఆ వాదనలతో న్యాయమూర్తి జస్టిస్ ఓక విభేదించారు. ఇది కేవలం షోకాజ్ నోటీసేనని, దానికి మీరు సమాధానం దాఖలు చేసుకొని వాదనలు వినిపించుకోవచ్చని సూచించారు. తాము దాఖలు చేసిన దరఖాస్తును ఉపసంహరించుకోవడానికి అవకాశం ఇవ్వాలని సింఘ్వీ కోరారు. దాంతో న్యాయమూర్తి జస్టిస్ ఓక సురేష్ ప్రొడక్షన్స్ దరఖాస్తును 'డిస్మిస్డ్ యాజ్ విత్‌డ్రాన్'గా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**ఇదీ నేపథ్యం**

విశాఖలో రామానాయుడు స్టూడియోకు 2003లో కేటాయించిన 34.44 ఎకరాల్లో సర్వే నంబరు 387/పిలోని 15.80 ఎకరాలను రెసిడెన్షియల్ లేఅవుట్‌గా మార్చేందుకు సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేసుకున్న దరఖాస్తుకు అనుమతిస్తూ 2023 మార్చి 2న జీవీఎంసీ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. వీటిని సవాలు చేస్తూ విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ 2023లో ఏపీ హైకోర్టులో పిల్ వేశారు. ఆ భూమిని కేవలం సినీ స్టూడియో ఏర్పాటు కోసమే కేటాయించారని, అందులో కొంత భాగాన్ని రెసిడెన్షియల్ లేఅవుట్‌కు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. విచారించిన హైకోర్టు ఇందులో ప్రజాహితం ఏముందంటూ 2023 మే 11న పిల్‌ను కొట్టేసింది. దీంతో వెలగపూడి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ భూమిని స్టూడియో అవసరాలకు కాకుండా ఇతరత్రా మళ్లించడానికి అనుమతివ్వడంపై కూటమి ప్రభుత్వం ఏప్రిల్ 7న సురేష్ ప్రొడక్షన్స్ సంస్థకు షోకాజ్ నోటీసులిచ్చింది. వాటిని సవాల్ చేస్తూ సురేష్ ప్రొడక్షన్స్ సుప్రీంకోర్టులో ఐఏ దాఖలు చేసింది.

## చంద్రబాబూ..
# రైతుల గోడు వినిపించడం లేదా?

(మొదటి పేజీ తరువాయి)

లేదు. చొరవ చూపి, మార్కెట్లో జోక్యం చేసుకోవాలన్న కనీస బాధ్యతను విస్మరించారు. పైగా డ్రామాలతో ఆ రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. ఇది న్యాయమేనా? మిర్చి విషయంలో కూడా మీరు రైతులను నమ్మించి మోసం చేశారు. మిర్చి కొనుగోలు అంశం కేంద్రం పరిధిలో లేకపోయినా, నాఫెడ్ కొనుగోలు చేస్తుందని మొదట నమ్మబలికారు. క్వింటాలు రూ.11,781కు కొంటామని చెప్పి, ఒక్కపైసా కూడా ఖర్చు పెట్టకుండా, ఒక్క రైతు నుంచి కాని, ఒక్క ఎకరాకు సంబంధించి కాని, ఒక్క క్వింటాల్ గాని కొనకుండా అన్నం పెట్టే రైతులకు సున్నం రాశారు. మా హయాంలో ధరల స్థిరీకరణ నిధి కింద రూ.3వేల కోట్లు పెట్టి, ఐదేళ్లలో రూ.7, 796 కోట్లు ఖర్చుచేశాం. చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని కనీస మద్దతు ధరల జాబితాలో లేని పొగాకు సహా అనేక పంటల రైతులను ఆదుకున్నాం. మీరు కొత్తగా ఏమీ చేయకపోయినా, కనీసం మా విధానాన్ని కొనసాగించి ఉంటే రైతులకు ఊరట లభించేది కదా? పైగా ఈ ఏడాది బడ్జెట్లో రూ.300 కోట్లు కేటాయించడం దారుణం కాదా? ఇందులో కూడా కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టిన దాఖలాలు ఉన్నాయా?.

**రైతుల ఆందోళనపై వైఎస్ జగన్ ట్వీట్**

ధాన్యం, కోకో, పొగాకు, ఆక్వా రైతులు ఆయా జిల్లాల్లో ఆందోళనలు చేస్తుంటే, ఇప్పటికీ రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించినట్లుగా వ్యవహరిస్తున్నారు. జనాభాలో 60శాతం మంది ప్రజలు ఆధారపడే వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల అది తీవ్ర సంక్షోభానికి దారితీస్తే, లక్షల మంది ఉపాధికి గండిపడితే దానికి బాధ్యత ఎవరు తీసుకుంటారు? వెంటనే ప్రభుత్వం తరఫున మార్కెట్లో జోక్యం చేసుకోవాలని, కనీస ధరలు లభించని పంటల విషయంలో ప్రభుత్వమే జోక్యంచేసుకుని, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను' అంటూ వ్యాఖ్యలు చేశారు.

## బెంగళూరులో ట్రాఫిక్
# చిక్కులకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

మే 15 నుంచి అందుబాటులోకి రానున్నట్లు- నమ్మ మెట్రో వెల్లడించింది. ఈ రూటు- ఆర్వీ రోడ్ నుంచి బొమ్మసంద్ర వరకు ప్రయాణికులు సులువు చేయనుంది. అలాగే ఎలక్ట్రానిక్ సిటీ- ప్రాంతంలో నివసించే లక్షల మంది ఐటీ ఉద్యోగులకు ఎల్లో లైన్ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనుంది. కొత్తగా మెట్రో ఎల్లో లైన్ రూటు- అందుబాటు-లోకి రావటం వల్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గటంతో పాటు- ఉద్యోగులకు ప్రయాణ సమయం ఆదా అవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విప్రో, ఇన్ఫోసిస్, హెచ్సీఎల్ వంటి దిగ్గజ -టె-క్ కంపెనీల ఆఫీసులు ఉన్న ఈ ప్రాంతంలో రద్దీ సమస్యలు తగ్గనున్నాయని అధికారులు చెబుతున్నారు. బొమ్మసంద్ర నుంచి ఎలక్ట్రానిక్ సిటీ-కి కేవలం 6 కిలోమీటర్ల దూరం ఉండటంతో మెట్రో కనెక్టివిటీ- ద్వారా కేవలం కొన్ని నిమిషాల ప్రయాణంతోనే గమ్యస్థానానికి చేరుకోవచ్చని టెక్కీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఫిబ్రవరి 14న చైనాలో తయారైన 6 కోచెస్ బెంగళూరుకు చేరుకున్నాయి. త్వరలోనే ఇలాంటివి మరో ఆరింటిని తీసుకురానున్నట్లు- అధికారులు చెబుతున్నారు. ఈ రూట్ స్టార్ట్ అయితే ప్రయాణికులు ఇండస్ట్రియల్ హబ్, రెసిడెన్షియల్ హబ్ మధ్య ప్రయాణం సుగమం అవుతుందని మెట్రో వర్గాలు చెబుతున్నాయి.

# పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆర్ అండ్ బీ రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయ అర్చకుల సూచనల మేరకు ఆగమ శాస్త్రం ప్రకారం బ్రహోత్సవాలకు ఏర్పాట్లు- చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు.

## అమరావతి అభివృద్ధితో
# ఎపికి మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

నా సోదర, సోదరీమణుల మధ్య ఉండటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అమరావతి భవిష్యత్ పట్టణ కేంద్రంగా ఆవిర్భవిస్తుంది.. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథాన్ని మెరుగు పరుస్తుందని నేను విశ్వసిస్తున్నాను అని చెప్పుకొచ్చారు. నాకు మంచి మిత్రుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకి అమరావతి పట్ల ఉన్న దార్శనికత, రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్ల ఆయనకున్న నిబద్ధతను నేను అభినందిస్తున్నాను అని ప్రధాని మోడీ రాసుకొచ్చారు. ఇక, ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా జరిగిన రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను అని సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు, మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లిన మీడియా, సోషల్ మీడియా వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను అన్నారు. కాగా, ప్రజల సహకారంతో, కేంద్రం మద్దతుతో పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీ-గా రాజధాని అమరావతిని నిర్మిస్తాం అని హామీ ఇచ్చారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి.. మాకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని తెలుపుతూ.. ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని చంద్రబాబు వెల్లడించారు. మరోవైపు, రాజధాని అమరావతి నిర్మాణ పనులను ఏపీ ప్రభుత్వం వేగవంతం చేస్తుంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా పునః ప్రారంభోత్సవం కార్యక్రమం పూర్తి కావడంతో పనులు వేగవంతం చేసింది. ఐకానిక్ భవనాల డిజైన్లు ఖరారు చేసేందుకు చర్చలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే డిజైన్లు రూపొందిస్తున్న సంస్థలతో మంత్రి నారాయణ మాట్లాడుతున్నారు. సీఆర్డీయే కార్యాలయంలో నార్మన్ పోస్టర్, హఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్ అండ్ టీ- సంస్థల ప్రతినిధులతో మంత్రి సమావేశం అయ్యారు. ఐదు ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాల తుది డిజైన్లపై కసరత్తు చేస్తున్నారు. ఆయా భవనాల డిజైన్లను మంత్రి, అధికారులకు ఆర్కిటెక్చర్ సంస్థల ప్రతినిధులు వివరిస్తున్నారు.

# కలెక్టర్ సుడిగాలి పర్యటన

## మండల అధికారులతో సమీక్షా సమావేశం



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):–** అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం ఎల్బీపీ అగ్రహారం, బంగారుమెట్ట గ్రామాల్లో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, సుడిగాలి పర్యటన చేశారు. ఎల్బీపీ అగ్రహారంలో ఎన్ఆర్ఈజీఎస్, జల్ జీవన్ మిషన్ పనులను పరిశీలించారు. బంగారుమెట్టలో నీటి తొట్టెలను ప్రారంభించారు. స్వయంగా కలెక్టరే ఆవుకు నీళ్లు త్రాగించారు. ఉపాధి శ్రామికులకు రోజువారి వేతనాలు అడిగి తెలుసుకున్నారు. కొబ్బరి మొక్కలను వీరివైపులు నాటారు. అనంతరం బుచ్చయ్యపేట మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, తహసీల్దార్ ఎం. లక్ష్మి, ఎంపీడీఓ వి. విజయలక్ష్మి, ఏపీఎం వరహాలు బాబు, మాజీ సర్పంచ్ తమరాన దాసు, మాజీ ఎంపిటిసి దొండా శ్రీను, ఎంపిటిసి ఎల్లపు జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ విద్యార్థులను సత్కరించిన విజయ్ కృష్ణన్



**రావికమతం, (విశాఖ సమాచారమ్):–** ఇటీవల టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సంపాదించిన కేజీబీవీ పాఠశాల విద్యార్థినిలను అనకాపల్లి జిల్లా కలెక్టర్ అభినందించారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రావికమతం మండలం గర్నికం పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా రావికమతం మండలం గర్నికం కేజీబీవీ పాఠశాల ఎస్.ఓ ఎల్.ఎల్ బాను ఉమ మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ 950 మార్కులు దాటిన వారిని, 10వ తరగతిలో 550 మార్కులు దాటిన విద్యార్థులకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా ఉత్తమ మార్కుల సంపాదించిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెమొన్టోల్లను అందజేసి విద్యార్థులను అభినందించినట్లు ఆమె తెలిపారు. ఇంటర్మీడియట్ లో టి. అశ్విని 1000 మార్కులకు గాను 969 మార్కులు, పదివ తరగతులు లో వర్షిత లాస్య 600 మార్కులకు గాను 568 మార్కులు వై. ఇందు శ్రీ 600 మార్కులకు గాను 567 మార్కులు సాధించి జిల్లా కలెక్టర్ విజయకృష్ణను చే అభినందించబడ్డారు అని ఆమె తెలిపారు. అలాగే పాఠశాల ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషిచేసిన పాఠశాల ఎస్ ఓ ఎల్ ఎల్ భానుఉమ ను జిల్లా కలెక్టర్ విజయకృష్ణను మెమెంటో తో సత్కరించి ఆమెను అభినందించారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**చాగల్లు :** చాగల్లు మండలంలో ఏడుగురు కుటుంబాలకు 13లక్షల చెక్కులు శనివారం టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు చేతులు మీద చెక్కులు పంపిణీ చేశారు. చాగలు గ్రామాలకు చెందిన ముగ్గురు కుటుంబాలకు బ్రాహ్మణగూడెం ఇద్దరికీ నేలటూరు గ్రామానికి నందిగంపాడు గ్రామానికి చెందినవారు మొత్తం 7 చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గారపాటి సుబ్బారావు, భగత్ మాధవ్ నందిగాం సుబ్బారావు, దొంగ రామకృష్ణ, గారపాటి మారుతిరావు పాల్గొన్నారు.

# కాశ్మీర్ ఎప్పుడూ భారత్‌లో భాగమే : ఫరూక్ అబ్దుల్లా

**అనంతనాగ్ :** కాశ్మీర్ ఎప్పుడూ భారతదేశంలో భాగంగానే ఉంటుందని జమ్మూకాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. శనివారం పెహల్గామ్‌లో ఆయన పర్యాటకులను కలిశారు. అనంతరం ఫరూక్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇటీవలే పెహల్గామ్‌లో దాడి జరిగింది. ఈ దాడి తర్వాత పర్యాటకులు భయపడడం లేదు. ఇదే పెద్ద సందేశం. భయాన్ని వ్యాప్తి చేయాలనుకున్న వారు (ఉగ్రవాదులు) ఓడిపోయారు. మనం భయపడబోమని ఈరోజు నిరూపితమైంది. కాశ్మీర్ ఎప్పుడూ భారతదేశంలో భాగంగానే ఉంటుంది. ప్రజలు ఉగ్రవాదం అంతం కావాలని కోరుకుంటున్నారు. ఉగ్రవాదాన్ని చూసి 35 సంవత్సరాలైంది. మనం పురోగతిని కోరుకుంటున్నాము. మనం ముందుకు సాగాలనుకుంటున్నాము. మనమే ఒకరోజు సూపర్ పవర్ అవుతాం' అని ఆయన అన్నారు.

కాగా, ఈ ఉగ్రదాడి తర్వాత ప్రధాని మోడీ సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాకిస్తాన్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో తీవ్రంగా స్పందించారు. ప్రధాని తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అలాగే 'సింధు నదిలో మా నాళ్లైనా పారాలి.. లేదా మీ రక్తమైన పారాలి' వంటి వివాదాస్పద వ్యాఖ్యలు కూడా చేశారు. ఈ వ్యాఖ్యలపైనా శనివారం ఫరూక్ అబ్దుల్లా స్పందించారు. అసలు బిలావల్ భుట్టో వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని.. ఆయన ప్రకటనలకు అంత ప్రాధాన్యత లేదని ఫరూక్ అన్నారు. బుట్టో వ్యాఖ్యలపై దృష్టి పెడితే.. మన దేశం ముందుకు సాగదని ఆయన అన్నారు.

# ఎమ్మెల్యే వంశీకృష్ణ 'జనవాణి' నియోజకవర్గ ప్రజలకు ఒక వరం

## జనసేన కార్పొరేటర్ డాక్టర్ మహ్మద్ సాదిక్ హర్షం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ సీతంపేటలోని జనసేన జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రతి రోజు నిర్వహిస్తున్న 'జనవాణి– పబ్లిక్ గ్రీవెన్' కార్యక్రమం విశాఖ దక్షిణ నియోజకవర్గ ప్రజలకు ఒక వరంగా నిలిచి, అపూర్వ విజయాన్ని సాధించిందని జనసేన పార్టీ ఉత్తరాంధ్ర కో – కన్వీనర్ మరియు జీవీఎంసీ కార్పొరేటర్ డాక్టర్ మహ్మద్ సాదిక్ హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే గారికి విన్నవించే అవకాశం పొందుతున్నారు. 'జనవాణి' నియోజకవర్గంలోని ప్రజల నుండి అనూహ్య స్పందనను రాబట్టడమే కాకుండా, సమస్యలను తక్షణమే పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తోందని డాక్టర్ సాదిక్ కొనియాడారు. ఈ కార్యక్రమం ప్రజలలో విశ్వాసాన్ని పెంపొందించి, ప్రభుత్వంతో వారి అనుబంధాన్ని బలోపేతం చేస్తోందని ఆయన అన్నారు.

విశాఖ దక్షిణ నియోజకవర్గ ప్రజల తరపున, ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీ వంశీకృష్ణ గారికి డాక్టర్ సాదిక్ గారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కళ్యాణ్ గారి స్ఫూర్తితో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారంలో ఒక మైలురాయిగా నిలిచిందని సాదిక్ అన్నారు . సమస్య పరిష్కార దిశగా జనవాణి కార్యక్రమంలో కృషి జరుగుతోంది అని డాక్టర్ సాదిక్ పేర్కొన్నారు.

# శ్రీ ముత్యాలమ్మతల్లి జాతర గోడపత్రిక ఆవిష్కరణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ ప్రజల ఆరాధ్యదేవత అయిన శ్రీ ముత్యాలమ్మతల్లి జాతర ఈ నెల 20న మంగళవారం నాడు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు జాతరకు సంబంధించిన గోడపత్రికను శనివారం పరవాడ జనసేన పార్టీ కార్యాలయంలో మండల ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మపాలెం సర్పంచ్ మరియు ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలు, రాష్ట్ర మత్స్యకార సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చింతకాయల సుజాత ముత్యాలు పాల్గొని జాతర ఏర్పాట్లను సమీక్షించారు.

జాతర సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ వెల్లడించింది. గ్రామ పెద్దలు, నాయకులు, యువత, భక్తులు జాతరలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

ఈ కార్యక్రమంలో రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు వియ్యపు చిన్నా, జనసేన మండల అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాస్, పూజారి చింతకాయల ముత్యాలు, దాసుడు సూరాడ దినేష్, కులపెద్ద మైలపల్లి మహేష్, దిబ్బపాలెం పూజారి గుడ్డి మసేను, దాసుడు అర్జిల్లి సోములు, జాలారిపేట ఒలిశెట్టి సింహాచలం, ఎంపిటిసి అర్జిల్లి దేవిరవి, కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, వైస్ ప్రెసిడెంట్ సూరాడ పెంటయ్య, మాజీ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, చింతకాయల సోములు, ఒలిశెట్టి అప్పలరాజు, చింతకాయల రాము తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే నెల 21న ప్రధాని రాక

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** నగరంలో వచ్చే నెల 9, 10 తేదీల్లో ఈ–గవర్నెన్స్‌పై జాతీయ సదస్సు జరగనున్నది. ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం సదస్సును నోవాటెల్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులు, పలు రాష్ట్రాల ప్రతినిధులు హాజరవుతారు. 'వికసిత్ భారత్–సివిల్ సర్వీసెస్ ఆన్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్' పేరిట ఈ సదస్సును కేంద్ర ప్రభుత్వంలోని డిపార్టుమెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్సస్, కేంద్ర కమ్యూనికేషన్లు, ఐటీ



మంత్రిత్వ శాఖ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. తక్కువ సిబ్బందితో అధిక ఫలితాలు సాధించేలా పాలనకు సంబంధించి మేధావులు, పారిశ్రామికవేత్తలు, విద్యావంతుల నుంచి సలహాలు తీసుకుని పాలసీ రూపొందించడమే సదస్సు ముఖ్య ఉద్దేశం. కాగా సదస్సుకు కేంద్రం, పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, ఉన్నతాధికారులు రానున్న నేపథ్యంలో నగరంలోని హోటళ్లలో 600 గదులను ముందుగానే రిజర్వు చేశారు. వాహనాలు ప్రధానంగా ఏసీ బస్సులు, కార్లు కోసం ట్రావెల్స్ సంస్థలతో మాట్లాడుతున్నారు. సదస్సు ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించింది. కలెక్టర్ అధ్యక్షతన పలు కమిటీలు ఏర్పాటుచేశారు. విశాఖ వేదికగా 2017లో చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు ఈ గవర్నెన్స్ జాతీయ సదస్సు జరిగింది.




# వివాహిత హత్య

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):–** వివాహితను దారుణంగా హత్య చేసి, నిర్జన ప్రదేశానికి తరలించి, పెట్రోలు పోసి దహనం చేసేందుకు యత్నించిన సంఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...భీమిలి మండలం దాకమర్రి సమీప ఫార్చ్యూన్ హిల్స్ లే అవుట్ వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నార్త్ ఏసీపీ ఎస్.అప్పలరాజు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సగం కాలిన మృతదేహాన్ని పరిశీలించి, వయసు సుమారు 25 సంవత్సరాలుంటుందని, ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడికి తీసుకువచ్చి పెట్రోలు పోసి దహనం చేసేందుకు యత్నించి ఉంటారని భావిస్తున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. మృతదేహాన్ని నిశితంగా పరిశీలించి వివాహితగా గుర్తించారు. విశాఖపట్నం లేదా విజయనగరం ప్రాంతాలకు చెందిన మహిళ అయి ఉంటుందని, అర్ధరాత్రి సమయంలో ఏదైనా వాహనంలో ఇక్కడికి తీసుకువచ్చి దహనం చేసేందుకు యత్నించి ఉంటారని ప్రాథమికంగా అంచనా వేశారు. సగానికి పైగా కాలిపోవడంతో ఆనవాళ్లు లభించలేదని ఏసీపీ అప్పలరాజు తెలిపారు. ఆనందపురం, పోతినమల్లయ్యపాలెం, పద్మనాభం, భీమిలి పోలీస్ సిబ్బందితో ఆరు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేసి, దర్యాప్తు బాధ్యతను అప్పగించినట్టు ఏసీపీ ఎస్.అప్పలరాజు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం వివరాలు తెలిసే అవకాశముందని భీమిలి సీఐ బి.తిరుమలరావు తెలిపారు.

# జూన్ 4న నర్సీపట్నంలో వైసిపి శాంతియుత నిరసన ర్యాలీ

## మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ వెల్లడి



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):–** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయని కారణంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 4న శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం నర్సీపట్నం సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో డి.ఎస్.పి పి శ్రీనివాసరావు ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వచ్చే నెల 4వ తేదీన శాంతియుత ర్యాలీ చేపట్టనున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలకు ప్రజలు అత్యాశకు పోయి ఓట్లు వేసి గెలిపించి ఈరోజు బాధపడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో ఒక్క పథకం కూడా అమలు చేయలేకపోయారన్నారు. నిరుద్యోగులను నిరుద్యోగ భృతి అంటూ మోసం చేశారని, తల్లికి వందనం, రైతు భరోసా, ఆడబిడ్డ నిధి మహాశక్తి, ఉచిత గ్యాస్ పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఎస్సీ ఎస్టీ బీసీలకు 50 సంవత్సరాలకు పెన్షన్ పథకాలతో మోసం చేశారన్నారు. ఒక్క నర్సీపట్నం నియోజకవర్గంలోనే ఇప్పటివరకు నాలుగు వందల46 కోట్ల పైచిలుకు కూటమి ప్రభుత్వం పథకాల లబ్ధిదారులకు బకాయి పడిందన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించి జూన్ 4వ తేదీకి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా జూన్ 4న ప్రభుత్వ విధానాలకు నిరసనగా శాంతియుత నిరసన ర్యాలీ చేపడుతున్నామన్నారు తద్వారా ప్రభుత్వం కదిలి వచ్చి పథకాల అమలు చేస్తే నియోజకవర్గ ప్రజలు లబ్ధి పొందుతారని ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# రాత్రి పూట డాక్టర్లు వైద్యం చేయరా

- సహాయకులు చేత వైద్యం చేయిస్తారా
- వైద్యం చేయకుండా జిల్లా ఆసుపత్రులకు తరలిస్తారా
- సూపరింటెంట్ను నిలదీసిన ఎంపీటీసీ బచ్చల రాజు




**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):–** మండల కేంద్రంలో నీ శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కపల్లి మండలం ఉద్దండపురం ఎంపీటీసీ బచ్చల రాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో రాత్రిపూట డాక్టర్లు సరిగా పనిచేయడం లేదని, రాత్రులు డాక్టర్స్ వున్నా సహాయ సిబ్బందితో వైద్యం చేపిస్తున్నారని, ప్రమాద బాధితులును ముట్టుకోకుండా అనకాపల్లి, విశాఖ కె జి హెచ్ కు రిఫర్ చేసి చేతులు దులుపు కుంటున్నారని ఆయన సంబంధిత ఆసుపత్రి సూపరిండెంట్ ను సర్వసభ్య సమావేశంలో నిలదీశారు.

# గూడుపమ్మ ను దర్శించుకున్న బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కర్రి ఆంజనేయులు



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):–** మండలంలోని రేబాక గూడుపమ్మ తల్లి క్షేత్రాన్ని శనివారం ఎలమంచిలి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కర్రి ఆంజనేయులు అమ్మవారిని దర్శించుకున్నారు. నవ దుర్గ సహిత అష్టాదశ శక్తి పీఠాల దేవతామూర్తులతో కూడిన గూడుపమ్మ తల్లికి ఆయన పసుపు కుంకుమలు సమర్పించారు. ఆయన గోత్ర నామాలతో పూజలు చేశారు. ప్రకృతి వనాల మధ్య అద్భుతమైన ఆలయాన్ని నిర్మించడం చాలా గొప్ప విషయమని అన్నారు. భవిష్యత్ లో ఈ ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజు ఆధ్వర్యంలో,అమ్మవారి శేష వస్త్రంతో ఆయన్ని సత్కరించారు.

# నేటినుంచి శ్రీ మత్స్య మాడుగుల జాతర



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):–** జి మాడుగుల లో వెలసిన శ్రీ మత్స్య రాస కులాదేవత మత్స్య మాడుగుల మ్మ జాతర మహోత్సవములు ఘనంగా నిర్వహించేందుకు భార్యాభర్తలు చేశారు. ముందుగా స్వర్గీయ పార్లమెంటు సభ్యులు మత్స్యరాస మత్స్య రాజు నుంచి పూజలు చేసి ఘటాలను రామాలయం దగ్గర ఏర్పాటు చేసిన శతకం పట్టువద్ద కొలువు తీర్చి మూడో రోజు మంగళవారం నాడు భారీ ఊరేగింపుతో అమ్మవారి మొక్కులు తీర్చుకుంటారు. జాతర సందర్భంగా మండల కేంద్రమైన జి మాడుగుల లోని పురవీధులు విద్యు త్ దీపాలతో అలంకరించారు. మూడు రోజులపాటు ఉత్సవ కమిటీ అధ్యక్షులు మత్స్య రాస రామరాజు కార్యదర్శి గాసాడి రెడ్డి బాబు గౌరవ అధ్యక్షులు మత్స్య రాస వెంకట గంగరాజు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

# గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



**రావికమతం, (విశాఖ సమాచారమ్):–** మండలంలో మరుపాక పంచాయతీ శివారు నాగన్నపాలెం గ్రామానికి చెందిన గొర్లె సత్తిబాబు గుండె పోటు తో శనివారం మృతి చెందాడు. వివరాల ప్రకారం మరుపాక పంచాయతీ శివారు రాయవరం పొర్లు కొట్టు నుండి దాసరయ్యపాలెం చెక్ డాం వరకు ఫీడర చానల్ (విడ్ నెంబర్ 1444420) ( జాబ్ కార్డు నెంబర్. 30003) పనులు చేస్తూ ఉండగా గొర్లె సత్తిబాబు కు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆయన పని వద్దనే క్రింద కూర్చుండిపోయి ఇబ్బంది పడ్డాడు. దీనిని గుర్తించిన మిగిలిన ఉపాధి శ్రామికులు ఆయనను ఇంటికి తరలించారు. తదనంతరం కుటుంబ సభ్యులు ఆయనను రావికమతం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన పరిస్థితి విషమించి మృతి చెందడంతో దీంతో కుటుంబ సభ్యులు బోరున వెలపించారు. ఈ విషయాన్ని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సేనాపతి శ్రీను, మృతిని భార్య గొర్లె భవానీ ఉపాధి హామీ కార్యాలయానికి, పత్రిక విలేకరులకు జరిగిన పరిస్థితిని తెలియపరిచారు.

విశాఖ సమాచారమ్

ఆదివారం 4-5-2025

# నవ్యాంధ్ర రాజధాని పునఃప్రారంభం

అమరావతిలో ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం పునఃప్రారంభించారు. మొట్ట మొదటిసారి 2015 అక్టోబర్ 22న మోదీ రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందు అనుకున్న ప్రకారం రాజధాని నిర్మాణం ఈ పాటికి పూర్తి కావలసింది. మొదటిసారి ప్రధాని శంకుస్థాపన చేసిన తరవాత ఎనిమిది వేల కోట్ల రూపాయలతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కొన్ని నిర్మాణాలు చేసింది. ఇందులో భాగంగా తాత్కాలిక సచివాలయం, శాసనసభ, హైకోర్టు లాంటి భవనాల నిర్మాణం జరిగింది. ఇప్పుడు శాశ్వత సచివాలయం, శాసనసభ, హైకోర్టు భవనాలు నిర్మిస్తారట. మోదీ శుక్రవారం మొత్తం రూ. 58,000 కోట్లు ఖర్చయ్యే నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. వివిధ ప్రభుత్వ విభాగాల అధిపతుల కార్యాలయాల కోసం నాలుగు బహుళ అంతస్తుల (టవర్ల) నిర్మాణం కూడా జరుగుతుందట. మొత్తం 74 పథకాల నిర్మాణానికి నడుం బిగించారు.. మొదటిసారి అమరావతిలో రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పుడు మోదీ దిల్లీ నుంచి ఒక చెంబెడు యమునా నది నీళ్లు, పార్లమెంటు భవన ఆవరణ నుంచి పిడికెడు మట్టి తీసుకొచ్చారు. ఈసారి కేంద్రం ఎన్ని నిధులు సమకూరుస్తుంది అన్న ప్రస్తావనే తీసుకురాలేదు. అయితే మోదీ వస్తు రీత్యా ఉదాహరణ ప్రాయంగానైనా ఏమీ తీసుకురాకపోయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ను పొగడ్తలతో ముంచెత్తారు. ఈ రెండు పార్టీలూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి మద్దతిస్తున్నాయి. అమరావతిలో రాజధాని నిర్మాణానికి మొదటిసారి శంకుస్థాపన జరిగిన 2015లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావును కూడా ఆహ్వానించారు. ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమరావతిలో రాజధాని నిర్మాణం కాబోతోంది కనక 5000 ఎకరాలలో అంతర్జాతీయ విమానాశ్రయం కూడా నిర్మిస్తారట. పక్కనే గన్నవరం విమానాశ్రయం ఉంది. దాన్నీ అంతర్జాతీయ విమానాశ్రయం అనే అంటున్నారు. మొదటిసారి రాజధాని నిర్మాణం ప్రారంభించే సమయంలో 33,000 ఎకరాల భూమి సమీకరించారు. దాన్ని భూ సేకరణ అనలేదు. రాజధాని నిర్మాణం పూర్తి అయిన తరవాత భూములు ఇచ్చిన వారికి అభివృద్ధి చేసిన కొంత భూమి ఇస్తామన్నారు. ఇంకా 44,000 ఎకరాల భూమి అవసరం అంటున్నారు. దాన్ని కూడా చంద్రబాబు ప్రతిపాదించిన భూ సమీకరణ పద్ధతిలోనే సేకరిస్తారేమో. ఉండవల్లి, పెనుమాక, వెంకటపాలెం రైతులు ఇప్పటికీ రాజధాని కోసం తమ భూములు వదులుకోవడానికి సిద్ధంగా లేరు. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాలి. రాజధాని నిర్మాణం కోసం భూమి సమీకరించడంలో ప్రధాన సమస్య ఆ ప్రాంతమంతా ఏడాదికి మూడు పంటలు పండే సారవంతమైన నేలే. పైగా తీవ్రమైన వరదలు వస్తే ఆ ప్రాంతమంతా నీట మునిగిపోతుందంటున్నారు. ఇటీవల బుడమేరు వరదెత్తినప్పుడూ ఇప్పుడు రాజధాని నిర్మించాలనుకుంటున్న ప్రాంతం కూడా వరద తాకిడికి గురైంది. 2019 ఎన్నికలలో చంద్రబాబు నాయకత్వంలోని తెలుగు దేశం పార్టీ ఓడిపోయి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరవాత రాజధాని నిర్మాణ పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. విజయవాడలో శాసనపరమైన రాజధాని, విశాఖపట్నంలో పాలనా రాజధాని, కర్నూలులో న్యాయ రాజధాని ఇలా మూడు రాజధానులు నిర్మించాలన్నది అప్పట్లో జగన్ పునః ప్రారంభమైన ఆలోచన. అయితే ఈ ఆలోచనను అమలు చేయడానికి ఎక్కడా నికరమైన పనులు జరిగిన దాఖలాలు లేవు. ఏమైతేనేం ఆంధ్రప్రదేశ్కు కొత్త రాజధాని నిర్మాణం అయిదేళ్లు ఆగిపోయింది. ఇప్పుడు మూడేళ్లలోగా అమరావతిలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటున్నారు. జగన్ అభ్యంతరాల వల్ల రాజధాని నిర్మాణ పనులు ఆగిపోయిన తరవాత రైతులు సుదీర్ఘ కాలం పోరాటం చేశారు. అమరావతిలో రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన 29 గ్రామాల ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఈ సుదీర్ఘ ఉద్యమానికి వైసీపీ మినహా మిగతా రాజకీయ పార్టీల మద్దతు సమకూరింది. గత జూన్లో చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం మళ్లీ అధికారంలోకి రావడంతో అమరావతిలో రాజధాని నిర్మాణ ప్రస్తావన మళ్లీ ప్రాణం పోసుకుంది. అమరావతిని అంతర్జాతీయ ప్రమాణాలకు దీటైన నగరంగా దిద్ది తీర్చాలన్నది చంద్రబాబు కల. మొత్తం రూ.77, 250 కోట్లు ఖర్చయ్యే పనులు చేపట్టాలన్నది చంద్రబాబు సంకల్పం. ఇప్పటికే రూ.49,000 కోట్లు ఖర్చయ్యే పనులు చేపట్టడానికి టెండర్లు కూడా పిలిచారు. ఇంత భారీస్థాయిలో రాజధాని నిర్మించడానికి అపారమైన నిధులు అవసరం. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు కలిసి రూ.13,600 కోట్ల రుణం ఇవ్వడానికి అంగీకరించాయి. అలాగే గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి కార్పొరేషన్ (హడ్కో) రూ.11,000 కోట్లు అందించడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. చంద్రబాబు చెబుతున్నట్టు మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేయడానికి ఇంకా బోలెడు నిధులు అవసరం. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందే సూచన కనిపించడం లేదు. శుక్రవారం పునః నిర్మాణాన్ని ప్రారంభించిన సందర్భంగా కూడా ప్రధానమంత్రి మోదీ నిధుల ప్రస్తావన తీసుకురాలేదు. అయితే రాజధాని నిర్మాణ పనులు చేపట్టడానికి సహకరిస్తామని మాత్రం చెప్పారు. ఈ సహకారం ఏ రూపంలో ఉంటుందో తెలియదు. 1800 సంవత్సరాల కింద అమరావతి శాతవాహనుల రాజధానిగా ఉండేది. అమరావతి పర్యావరణ అనుకూల రాజధానిగా ఉంటుందని చంద్రబాబు చెబుతున్నారు. కానీ ఉన్న పర్యావరణానికి కలిగే ముప్పు గురించి ఆలోచిస్తున్నట్టు లేదు. తెలంగాణ రాజధాని లేకుండా పోవడంతో కొత్త రాజధాని నిర్మించవలసిన అవసరం ఏర్పడింది. ఎప్పటికైనా రాజధాని నిర్మించుకోవలసిందే. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి 1953లో ఆంధ్ర ప్రాంతం విడిపోయిన తరవాత కూడా ఆంధ్ర ప్రాంతానికి రాజధాని లేకుండా పోయింది. అప్పుడు కర్నూలులో రాజధాని ఏర్పాటు చేయాలనుకున్నారు. ఉన్న భవనాల నుంచి పరిపాలన ప్రారంభం అయింది. అప్పుడు కూడా కొత్త భవనాల నిర్మాణం నామమాత్రమే. మూడేళ్లు గడిచేటప్పటికి ఆంధ్ర, తెలంగాణ కలిసి ఆంధ్రప్రదేశ్ గా ఏర్పడ్డాయి. హైదరాబాద్ అప్పటికే అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన నగరం కనక తెలుగు వారందరికీ రాజధానిగా ఉపకరించింది. రావతి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత ఆంధ్రప్రదేశ్ కు 2014లో రాష్ట్ర విభజన తరువాత మిగిలిన ఆంధ్రప్రదేశ్ మళ్లీ రాజధాని నిర్మించుకోవలసిన అగత్యం వచ్చింది. వైఎస్ జగన్ 2019లో అధికారంలోకి వచ్చిన తరవాత ఆయన మూడు రాజధానుల ప్రస్తావన అయితే తెచ్చారు తప్ప ఎక్కడా రాజధాని నిర్మాణ పనులు మొదలే కాలేదు. ఆయన పాలన ముగిసి గతేడాది చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చే నాటికి సగం నిర్మాణం పూర్తి అయిన మొండి గోడలే మిగిలాయి. ఇప్పుడైనా ఆ కల నెరవేరుతుందేమో చూడాలి.


పంచాంగం

ఆదివారం 4-5-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాయణం, వసంత ఋతువు
వైశాఖ మాసం

తిథి : శు. సప్తమి ఉ. 7.19
నక్షత్రం : పుష్యమి ప. 12.54
వర్జ్యం : రా. 2.17 ల 3.57

# నీళ్ల నిలుపుదల ఎంత సాధ్యం?

అరువై ఏండ్ల కిందట కుదుర్చుకున్న సింధు నదీజలాల పంపిణీ ఒప్పందాన్ని నిలిపి వేయాలని నరేంద్ర మోదీ నాయ క త్వంలోని భారత ప్రభుత్వం నిర్ణయించడం పాక్లో కలకలం రేపిం ది. ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960వ దశకం ఆరంభంలో సింధు నదీజలాల పంపిణీ ఒప్పందం కుదరింది. ఈ ఒప్పందం ప్రకారం పశ్చిమ వాహినులైన సింధు, జీలం, చీనాబ్ నదుల జలాలను పాకిస్థాన్కు, తూర్పు దిశగా ప్రవహించే రావి, బియాస్, సట్లెజ్ నదీజలాలను భారత్కు ప్రత్యేకించారు.



గత అరువై ఏండ్ల కాలంలో భారత్, పాకిస్థాన్ మధ్య 1965, 1971 కార్గిల్ వంటి ఎన్నో యుద్ధాలు జరిగినా, ముంబై తాజ్ హోటల్పై ఉగ్రవాదులు దారుణ మారణహోమం జరిపి ఎందరో అమాయకులను కాల్చి చంపినా, పాక్ గూఢచారి సంస్థలతో లష్కరే తోయిబా వంటి మతోన్మాద ఉగ్రవాదులు తెగబడి ఎన్నో హిం సాత్మక విధ్వంసక దాడులు జరిపినా, సింధు జలాల ఒప్పందం చెక్కు చెదరలేదు. అయితే పాక్ ప్రేరణతో పహెల్గాంలో ఉగ్రవాదులు జరిపిన మారణకాండతో దేశమంతా ఆగ్రహావేశాలు పెల్లుబుకు తున్నాయి. అందుకే ఉగ్రవాద హింసాకాండపై దృఢమైన వైఖరిని భారత ప్రభుత్వం వ్యక్తం చేసింది. కొత్త ఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయ సిబ్బందిని సగానికి సగం తగ్గించింది. సైనిక సల హాదారులను, భారత్లో ఉన్న పాక్ పౌరులను వెంటనే దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. సరిహద్దుల్లో భారత సైన్యాన్ని సర్వ సన్నద్ధంగా ఉంచింది.

దేశంలోని కీలక ప్రాంతాల్లో నిఘా పెంచింది. సింధు పరీవాహక ప్రాంతం నుంచి లభించే జలాలు పాక్ 'జీవ నాడి' వంటివి. అందుకే తీవ్రవాదం పెరిగిపోతున్న పాక్ను కట్టడి చేసేందుకు పాక్ ఆర్థిక మూలాలను దెబ్బతీసే వ్యూహాన్ని అమలు చేసి గుణపాఠం నేర్పాలని ప్రయత్నిస్తున్నది.

పాకిస్థాన్ నీటి అవసరాల్లో 76 శాతం సింధు, బియాస్, సట్లెజ్ జలాల ద్వారానే తీరుతున్నాయి. 80 శాతం భూములకు ఈ నదులు జీవ జలాలను అందిస్తున్నాయి. పాక్లో 90 శాతం ఆహారోత్పత్తి సింధు నదీజలాల ద్వారానే జరుగుతున్నది. కేవలం 244 మి.మీ. వార్షిక వర్షపాతం గల పాకిస్థాన్కు సింధు నదీజలాల ద్వారానే తాగునీరు లభిస్తున్నది. పాకిస్థాన్లో దాదాపు 40 శాతం శ్రామికులకు ఈ నదీజలాల ద్వారానే ఉపాధి లభిస్తున్నది. పాక్ జాతీయోత్పత్తి జీడీపీలో 24 శాతం సింధు నదీజలాల ఆధారంగా జరిగే ఉత్పత్తి ద్వారానే వస్తున్నది. టర్బేలా, మంగళ వంటి భారీ జలాశయాలు సింధు జలాల ద్వారా నిండుతున్నాయి. సింధు నది కాలువల వ్యవస్థ పాక్కు అత్యంత కీలకం. నీటి కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం అధిక నీరు అవసరమయ్యే వరి, గోధుమ వంటి ఆహార పంటలు, పత్తి వంటి వాణిజ్య పంటల సాగువల్ల తరచూ నీటి కొరత ఏర్పడుతున్నది. తీవ్ర నీటి కొరత గల దేశాల్లో పాక్ది మూడవ స్థానం అని ఆ సర్వేలో తేలింది. వాతావరణ మార్పుల వల్ల హిమ ఖండాలు కరిగి తొలుత నీటి లభ్యత పెరిగినా తదుపరి కొరత తప్పదు. ఈ పరిస్థితుల్లో సింధు నదీజలాల ఒప్పందాన్ని నిలిపివేయడం వల్ల పాక్కు 70 శాతం నీటి సరఫరా తగ్గి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయని నిపుణుల అంచనా.


పంజాబ్, సింధు వంటి సస్య శ్యామల రాష్ట్రాలు మరు భూములుగా మారవచ్చు. సింధు నదీ పంట కాలువలకు నీటి సరఫరా నిలిచిపోతే పాక్లో ఆహారోత్పత్తి పడిపోయి ధరలు, దారిద్ర్యం పెరిగి ఆకలితో అలమటించే దుస్థితి ఏర్పడవచ్చు. పాక్ జనాభాలో 80 శాతం గ్రామీణ ప్రజలు. వారి జీవనోపాధి వ్యవసాయమే. సింధు జలాలు నిలిపివేస్తే వారు ఉపాధి కోసం లాహెూర్, కరాచి, పెషావర్, రావల్పిండి వంటి పట్టణాలకు వలస పోవలసి ఉంటుంది. ఇప్పటికే నీరు, విద్యుత్తు, రహదారులు ఇలా కొరతతో సతమతమవుతున్న ఆ నగరాల ప్రజావసరాలు మరింత దుర్భరంగా మారవచ్చు. సింధు నదీజలాల ద్వారా జరిగే 30 శాతం జలవిద్యుత్తు ఉత్పత్తి బాగా పడిపోయి పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు మూసివేస్తే నిరుద్యోగం మరింత పెరిగే అవకాశమున్నది.

ఒక్కసారిగా సింధు జలాలను ఆపివేస్తే ఆ నీటి నిల్వకు అనువైన జలాశయాలు భారత్లో లేవు. వానకాలంలో అదనంగా వచ్చే నీటిని నిల్వ చేయడం కష్టం. పడమటి దిశగా వెళ్లే జలాలను ఇతర ప్రాంతాలకు మళ్లించాలంటే ఇంజినీరింగ్ నైపుణ్యాలే గాక సమయం అవసరం. భాక్రానంగల్ తదితర డ్యాంలు తూర్పు దిశగా పారే నీటి నిల్వకే సరిపోతాయి. పల్లపు ప్రాంతాలు ముఖ్యంగా కశ్మీర్లో ఎక్కువ భాగం ముంపునకు గురవుతాయి. పాక్లో కూడా అత్యవసర పరిస్థితి రావచ్చు.

రక్తపుటేరులు, నీరు ఏకకాలంలో ప్రవహించే వీల్లేదని ప్రధాని మోదీ పాక్ నేతలకు గట్టి హెచ్చరిక చేసినా ఫలితం లేకపోయింది. అందుకే సింధు జలాల నిలుపుదల ముందుకు తెచ్చారు. ఉగ్రవాదాన్ని నిరోధిం చకపోతే సింధు జలాలను ఇతర ప్రాంతాలకు మళ్లిస్తామని కేంద్ర మం త్రి నితిన్ గడ్కరీ కూడా హెచ్చ రించారు. ఇదే జరిగితే పాక్ పొరుగు దేశంగా ఉన్న చైనా సింధు నదికి ఎగువన డ్యామ్లు నిర్మించి భారత్ను కట్టడిచేసేందుకు ప్రయత్నించవ చ్చు. సింధు జలాలను నిరోధిస్తే పాక్కు భారీగా నీటి కొరత ఏర్ప డవచ్చు. పాకిస్థాన్ ఇప్పటికైనా మత చాందసవాదులను పైకి ఎగ దోసి, మత మారణకాండను ప్రేరే పించే దుశ్చర్యలకు స్వస్తి చెప్పి వాస్తవ దృష్టితో వ్యవహరించి ప్రజలకు అన్నవస్త్రాలు అందించి, అభివృద్ధి పథంలో పయనిస్తేనే ఉపఖండంలో సుహృద్భావం, శాంతి సాధ్యమవుతుంది.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)
– పతకమూరు దామోదర్ ప్రసాద్

# సింహాచలం ఘటనపై అశోక్ నోరిప్పలేదేం



సింహాద్రి అప్పన్న చందనోత్సవం సందర్భంగా భారీ ఎత్తున భక్తులు వచ్చిన తరుణంలో ఏర్పాట్లు... భద్రత వంటి చర్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం ఏడుగురు భక్తుల ప్రాణాలను గాలిలో కలిపేసింది. దీనికి సంబంధించి ఇప్పుడు బయటపడుతున్న పలు లోపాలు చూస్తూ భక్తులు విస్తు పోతున్నారు. అతి తక్కువ సమయంలో గోడ నిర్మించలేనని కాంట్రాక్టర్ చెప్పినప్పటికీ పరవా లేదు మేము చూసుకుంటాం ఏదోలా పూర్తిచేసేయ్ అంటూ దేవాలయ యాజమాన్యం మంత్రులు తనపై ఒత్తిడి చేసి తూతూ మంత్రంగా పనులు పూర్తి చేయించారని కాంట్రాక్టర్ అంగీకరించారు.

ఇదిలా ఉండగా ఉత్సవానికి ముందు పలువురు మంత్రులు సింహాచలాన్ని సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించినట్లు పరిశీలించినట్లు సూచనలు సలహాలు ఇచ్చినట్లు పత్రికల్లో కథనాలు ఫోటోలు అయితే వేయించుకున్నారు కానీ వారు ఎక్కడ ఏమి చూసినట్లు లేదు. అలా వచ్చి మామూలుగా అధికారులతో సమావేశమై జ్యూస్ తాగి స్నాక్స్ తిని వెళ్లిపోయారు అన్నది ఈ సంఘటన తర్వాత అర్థమవుతుంది. ఇదంతా ఎలా ఉండగా సింహాచలం దేవస్థానానికి సంబంధించి అనువంశిక ధర్మకర్త ట్రస్ట్ బోర్డు చైర్మన్ అశోక్ గజపతిరాజు ఈ అంశంపై ఇంతవరకు కిక్కురుమనలేదు. గతంలో ఆయన ధర్మకర్తృత్వం లోని రామతీర్థం గుట్టపై శ్రీరాముని విగ్రహాన్ని కొంతమంది దుండగులు ధ్వంసం చేసిన ఘటన కు సంబంధించి ఆయన స్పందన విపరీతంగా ఉండేది. కళ్ళు ఎగరేస్తూ గాలిలో చేతులు తిప్పుతూ నాటి వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని తూలనాడారు. చైర్మన్ అయిన తనకు కూడా ఏమాత్రం సమాచారం లేదని బాధ్యత వహిస్తే పరిస్థితి వేరుగా ఉండేది అన్నట్లుగా ఆయన మాట్లాడారు. నాటి సంఘటనకు వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తి బాధ్యత అని దుమ్మెత్తి పోశారు.


**నేడు సౌండ్ లేదేం అశోక్ రాజా**

నేడు సింహాచలం అప్పన్న స్వామికి చందనోత్సవం సందర్భంగా తొలి దర్శనం చేసుకుని పట్టు వస్త్రాలు సమర్పించేది కూడా విజయనగరం పూసపాటి కుటుంబీకులే. గతంలో ఆనందగజపతి రాజు ఈ సాంప్రదాయం పాటించగా నేడు అశోక్ గజపతి అప్పన్నకు చైర్మన్ హెూదాలో పట్టు వస్త్రాలు సమర్పిస్తూ వస్తున్నారు. మరి దేవాలయ చైర్మన్గా ఆయనకు ఈ దుర్ఘటనతో సంబంధం లేదా..? బాధ్యత లేదా ? అంత పెద్ద ప్రమాదం జరిగి ఏడుగురు ప్రాణాలు కోల్పోయి మరికొందరు ఆసుపత్రిపాలవగా ఆయన మాత్రం ఏ మాత్రం నోరు విప్పడం లేదు.

ఉత్సవాలకు ముందు మంత్రులతో పాటు ఆయన కూడా సమీక్షలో పాల్గొని ఆహా ఓహెూ అది చేశాను ఇది చేశాం అంటూ ఫోటోలు ప్రకటనలు ఇచ్చి ఇంటికి వచ్చారు తప్ప ప్రమాదం జరిగి ఇన్ని ప్రాణాలు గాలిలో కలిసిపోయిన ఆయన ఏమాత్రం స్పందించడం గాని.. దేవాలయ ట్రస్ట్ బోర్డు తరఫున ఓ ప్రకటన కానీ ఇవ్వలేదు.. అసలు ఆ సంఘటన జరిగినట్లే ఆయన గుర్తించినట్లు కనిపించలేదు. ఎందుకంటే తాను కొనసాగుతూ వస్తున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంది కాబట్టి ఏ ఆలయంలో ఏం జరిగినా ఆయనకు కనిపించదు.. వినిపించదు. అదే వైయస్ జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా చిత్ర విచిత్రమైన అభినయాలతో అశోక్ గజపతి మీడియా ముందుకు వచ్చేస్తారు.. ఇప్పుడు ఈ సంఘటన జరిగినప్పుడు కూడా ఆయన నోరు విప్పితే తన హుందాతనానికి మరింత గౌరవం వచ్చేదని ప్రజలు అంటున్నారు.

సిమ్మాదిరప్పన్న

## నాలాగా వందేళ్లు బతకాలంటే ఇలా చేయండి: ఓ డాక్టర్ చెప్పిన మాట



ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించాలనే ఆకాంక్ష అందరిలోనూ ఉంటుంది. దీనికోసం ఆహార నియమాలు, ఒత్తిడి లేని జీవనం వంటి ఎన్నో మార్గాలు అనుసరిస్తుంటాం. అయితే, వందేళ్లకు పైగా ఆరోగ్యంగా జీవించిన ప్రివెంటివ్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ జాన్ షార్ఫెన్బర్గ్ (101) దీర్ఘాయుష్షుకు అసలైన రహస్యం వ్యాయామమేనని, అది ఆహారం, ఒత్తిడి నిర్వహణ కంటే కూడా కీలకమని నొక్కి చెబుతున్నారు. ఆయన అనుభవాలు, సూచనలు దీర్ఘాయుష్షుపై కొత్త వెలుగును ప్రసరిస్తున్నాయి.

**వ్యాయామం ప్రాముఖ్యత**

డాక్టర్ షార్ఫెన్బర్గ్ ప్రకారం, దీర్ఘాయుష్షుకు అత్యంత ముఖ్యమైన అంశం రోజువారీ శారీరక శ్రమ. ఇది కేవలం బరువు తగ్గడానికో, ఫిట్గా ఉండటానికో మాత్రమే కాదు, జీవన ప్రమాణాన్ని పెంచే ప్రాథమిక అవసరం. ఆశ్చర్యకరంగా, సాధారణ బరువు ఉండి శారీరక శ్రమ లేని వ్యక్తి కంటే, కాస్త అధిక బరువు ఉండి కూడా రోజూ చురుగ్గా వ్యాయామం చేసే వ్యక్తి ఎక్కువ కాలం జీవించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఆయన తెలిపారు. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి సమస్యలున్నా, చివరికి పొగతాగే అలవాటు ఉన్నా సరే.. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారు, ఎలాంటి చెడు అలవాట్లు లేకపోయినా శారీరకంగా నిష్క్రియంగా ఉండేవారికంటే ఎక్కువ ఆయుష్షు పొందగలరని ఆయన స్పష్టం చేశారు. ఇక్కడ ముఖ్యమైనది జిమ్లో గంటల తరబడి చేసే కఠిన వ్యాయామం కాదు, రోజువారీ నిలకడైన 'కదలిక'.

**జీవనశైలి ప్రభావం**

జన్యువులు ఆయుష్షును కొంతమేర నిర్దేశించినా, మనం ఎంచుకునే జీవనశైలే అంతిమంగా ఎక్కువ ప్రభావాన్ని చూపుతుందని డాక్టర్ షార్ఫెన్బర్గ్ తన అనుభవంతో చెప్పారు. ఒకే రకమైన జన్యువులున్న తన సోదరుడు భిన్నమైన, శ్రమలేని జీవనశైలి కారణంగా తక్కువ వయసులోనే మరణిస్తే, తాను నిరంతర శారీరక శ్రమ వల్లే వందేళ్లు దాటగలిగానని వివరించారు.

**సంపూర్ణ ఆరోగ్యం**

వ్యాయామం ప్రధానమే అయినప్పటికీ, సంపూర్ణ ఆరోగ్యానికి ఇతర అంశాలు కూడా దోహదం చేస్తాయి. సానుకూల దృక్పథం, ఆనందంగా ఉండటం ఒత్తిడిని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. "బ్లూ జోన్స్" (ప్రపంచంలో ఎక్కువ కాలం జీవించే ప్రజలున్న ప్రాంతాలు) ప్రజల ఆహారంలో మొక్కల ఆధారిత పదార్థాలు (కూరగాయలు, పండ్లు, గింజలు, పప్పుధాన్యాలు) అధికంగా ఉండటం వారి దీర్ఘాయుష్షుకు ఒక కారణంగా గుర్తించారు. మానసిక ప్రశాంతత, బలమైన సామాజిక సంబంధాలు కూడా ఆయుష్షును పెంచడంలో సహాయపడతాయి.

# సోరియాసిస్ వ్యాధి గురించి సంపూర్ణ వివరణ




మనుష్యులకు వచ్చు అత్యంత తీవ్రమైన మరియు అంత సులభముగా లొంగని ఒక వ్యాధి గురించి మీకు వివరిస్తాను. దాని పేరు "సిధ్మ కుష్టు" దీనిని " సోరియాసిస్ " అంటారు. ఇది ఒక రకమైన కుష్టు వ్యాధిగా ఆయుర్వేదం పరిగణించినది . 18 రకాల కుష్టు వ్యాధులలో ఇది ఒకటి. ముఖ్యంగా దీని లక్షణాలు చర్మం పైన పెద్ద పెద్ద మచ్చులు ఏర్పడి పొట్టు రాలడం . అదే విధముగా కీళ్ల భాగములో సోరియాసిస్ వచ్చినపుడు "సోరియాసిస్ ఆర్థరైటిస్ " వచ్చును. ఇది అత్యంత మొండి వ్యాధి .

ఇది రావడానికి ప్రధానమైన కారణం . విరుద్ధమైన ఆహారాలు భుజించటం వలన శరీరం నందలి రక్తం దోషం పొందటం వలన , తీవ్రమైన మానసిక ఒత్తిడి వలన ఈ వ్యాధి సంప్రాప్తించును. దీనికి చికిత్స చేయడం అత్యంత సవాలుతో కూడుకుని ఉన్నది. అల్లోపతి వైద్యవిధానము నందు దీనికి సంపూర్ణమైన చికిత్స లేదు . ఒక్క ఆయుర్వేదం మాత్రమే దీనికి సంపూర్ణ పరిష్కారం చూపించగలదు. ఈ సమస్యని నేను నయం చేయుటకు ఎంతో పరిశోధించి కొన్ని ఔషధ మిశ్రమాలను తయారుచేశాను . వీటితో అత్యంత సులభముగా " సోరియాసిస్ " సమస్యను నిర్మూలించవచ్చు. మొదటి 2 నుంచి 3 నెలలలో మీకు మార్పు వస్తుంది . 6 నెలలపాటు ఆపకుండా వాడవలెను .

**కాళహస్తి వేంకటేశ్వరరావు**
**అనువంశిక ఆయుర్వేద వైద్యులు**
**9885030034**

# కంగారు పడొద్దు

గుడిలో కొబ్బరికాయ కొట్టేటప్పుడు అది పాడై పోయిందని తెలిస్తే మనసు ఎంతో బాధపడుతుంది. జరగరానిదేదో జరిగిందని బాధపడతాం. ఎక్కడ ఏ తప్పు జరిగిందో, ఏం జరుగుతుందో అని పరి పరి విధాలా ఆలోచిస్తాం. ఇది సహజం.

అయితే ఓ ఆలయ అర్చకులు చెప్పిన మాటలతో ఊపిరి పీల్చుకోవచ్చు. ఆయన చెప్పే మంచి మాటలు పాజిటివ్ ధోరణిలో ఉన్నాయి. అవేంటో చూడండి.....

కొబ్బరికాయ పాడై పోయిందని బాధపడకండి. ఆందోళన చెందకండి. దిష్టి వంటివేవైనా ఉంటే ఇటువంటి వాటితో పోతాయి. భగవంతుడి సన్నిధిలో ఏం జరిగినా అది మంచికే అని అనుకోండి. అంతేతప్ప కంగారు పడకండి.

ఆయన చెప్పిన ఈ మాటలు ఉత్తమం. నిజం కూడా. ఇందులో ఏముంది, ఇంకొక కొబ్బరికాయ కొనుక్కొచ్చుకుని కొట్టండి. మీ జీవితం ఉన్నతంగా ఉంటుందంటారాయన.

బాధ పడే మనసుకి దేవుడే వచ్చి నాలుగు మంచి మాటలు చెప్పి దీవించేడా అన్నట్లనిపిస్తుంది. మనసూ తేలికవుతుంది.

వెలిగించిన దీపం ఆరిపోయినా, కర్పూరం ఆరిపోయినా ఆందోళన తగదు. చేసే పనిలో అప్రమత్తంగా ఉండాలి, ఆలోచించి చెయ్యాలని దేవుడు చెప్పినట్లు అనుకోవాలి. అంతేతప్ప



మరొకటి కాదన్నది ఆ అర్చకుల మాట.

– యామిజాల జగదీశ్

# విశాఖ శ్రీ శారదా పీఠంలో వైభవంగా శ్రీ శంకర జయంతి మహోత్సవం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** శ్రీ శంకర జయంతి సందర్భంగా విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారి ఆశీస్సులతో, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో 02.05.2025 (శుక్రవారం) ఉదయం 6:30 గంటలకు శ్రీ శంకరాచార్య స్వామి వారికి విశేష అభిషేకం, అర్చన, నీరాజన, మంత్రపుష్పం శాస్త్రోక్తంగా నిర్వహించబడినది. అనంతరం వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య బ్రాహ్మణ బాలకులకు సామూహిక ఉపనయన కార్యక్రమం (బ్రహ్మోపదేశం) అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పీఠాధిపతుల సమక్షంలో తమ పిల్లలకు బ్రహ్మోపదేశం జరగడం తమ పూర్వజన్మ సుకృతంగా భావించి, వారు ఆనందభరితులయ్యారు. సాయంత్రం 6:00 గంటలకు శ్రీ శంకరాచార్యుల విరచిత స్తోత్ర పారాయణం, నామ సంకీర్తన ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఆధ్యాత్మిక మహోత్సవాల్లో అనేక మంది భక్తులు పాల్గొని, పీఠం నిర్వహించిన కార్యక్రమాలను దర్శించి అద్భుతమైన ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.

# రెండవ రోజు బంద్ పై ఆగ్రహం



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):–** అరకులోయలో రెండవ రోజు వైసీపీ ప్రభుత్వం బంధు ప్రకటించి బంద్ చేయడంపై అరకు వెళ్లి సర్పంచ్ పెట్లే దాసు బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం జరిగే రాష్ట్ర బంద్ జీవో నెంబర్ 3 కోసం అనేక ప్రజా సంఘాలు మరియు అనేక పార్టీ కార్యకర్తలు కలిసి బంధు కార్యక్రమం చేపట్టడం వలన తప్పులేదని మనకు ఏదైనా తప్పు జరిగినప్పుడు ప్రజా సంఘాల ద్వారా ప్రభుత్వానికి మన సమస్యలు చేరేవరకు మనం బంద్ చేయడం తప్పు లేదని కానీ ఈరోజు శనివారం చేస్తున్న బంధు కేవలం రాజకీయ లబ్ధి కోసమే అని ఆయన అన్నారు ఈ ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులు ప్రజలు మోసం చేయడం కోసం వైసీపీ పార్టీ రెండో రోజు బందు ప్రకటించడం చాలా బాధాకరమని ఆయన తెలియజేశారు గత ఐదు సంవత్సరాల్లో వైసిపి ప్రభుత్వం పరిపాలన చేసిందని వైసిపి పరిపాలన ఉన్నప్పుడే జీవో త్రీ ని సుప్రీంకోర్టులో కొట్టివేస్తే ఆరోజు ఉన్నటువంటి ఎమ్మెల్యే గాని మంత్రులు గాని ముఖ్యమంత్రి గాని ఎవరూ కూడా ఈ విషయం గురించి మాట్లాడు పోగా కనీసం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ చేయలేని వైసిపి పార్టీ శ్రేణులు రెండవ రోజు బంద్ చేయడం కాక తెలుగుదేశం పార్టీపై బురద చల్లడం అనేది ఎంతవరకు సమంజసం అని ఆయన మండిపడ్డారు గత ఐదు సంవత్సరాలు పరిపాలన ఉన్నప్పుడే జీవో త్రీ ఇన్ రద్దు చేయడం అలాంటప్పుడే సాధించలేని ఈ వైసీపీ నాయకులు ఇప్పుడు బంద్ చేసి ఏం సాధిస్తారని ప్రజలను మబ్బి పెట్టడం కోసమే ఈ బందులు ఏర్పాటు చేస్తున్నారని ఆయన అన్నారు.

# రోడ్డు భద్రత అవగాహన సదస్సు



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):–** అల్లూరి జిల్లా అరకులోయలో ఎస్పి అమిత్ బర్దర్ వారి సూచనల మేరకు అరకు వేలి సిఐ హిమగిరి రావు స్థానిక అక్షయ ఇన్ హోటల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి స్థానికంగా ఉండే లారీ, కారు, ఆటో. వాహన యజమానులను పిలిపించి వారి ద్వారా ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా సిఐ హిమగిరిరావు మాట్లాడుతూ వాహనాల వల్ల టూరిజం ప్లేస్ అయిన మన అరకులోయలో ట్రాఫిక్ తో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు తమ వాహనాలను ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఉంచాలని ఆయన అన్నారు మరియు వాహందారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించి వాహనాలు నడపవలెనని అలాగే మత్తు పానీయాలు సేవించి వాహనాలు నడపరాదని ఆయన సూచించారు ఈ రోజుల్లో ట్రాఫిక్ చలానాలు చాలా ఎక్కువగా పెరిగి పోయావని ఆయన అన్నారు తదుపరి వాహనాల యాజమాన్యులు తమ తమ అభిప్రాయాలను తెలియజేశారు ముఖ్యంగా ఆటో వారు అధిక లోడు ఎక్కించుకొని స్పీడ్ గా డ్రైవ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు మరియు మన ఏజెన్సీలో బైక్లపై చాలా స్పీడ్ గా డ్రైవ్ చేస్తూ ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన అన్నారు ఇలాగా స్పీడుగా బైకులు డ్రైవ్ చేసి ఎవరైనా మాకు దొరికినట్లు అయినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు తదుపరి కారు యాజమాన్యాలు మాట్లాడుతూ కార్ పార్కింగ్ ప్లేస్ అరకువెల్లో లేనందువలన చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నామని అన్నారు ఈ విషయంపై స్పందించిన ఎస్ఐ గోపాల్ రావు స్థానిక ఎమ్మార్వో తో కలిసి మీకు స్థలాన్ని ఏర్పాటు చేస్తామని వాపోయారు ఈ కార్యక్రమంలో సిఐ హిమగిరిరావు ఎస్సై గోపాలరావు ఎమ్మార్వో ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మక "విశ్వదాత" అవార్డుకు గంట్ల ఎంపిక

## ఎలకుర్రులో ఈ నెల 8న ప్రధానం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, మహాత్మాగాంధీకి అత్యంత ప్రీతి పాత్రులు,అమృతాంజనం, ఆంధ్రపత్రిక వ్యవస్థాపకులు దేశోద్ధారక, విశ్వదాత బిరుదాంకితులు కి శే. కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు పేరిట అయన జన్మస్థలం కృష్ణా జిల్లా పామర్రు మండలం ఎలకుర్రులోని"విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ "ప్రతి ఏటా ప్రధానం చేసే "విశ్వదాత " అవార్డుని ఈ ఏడాది జర్నలిజం, సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలందించిన విశాఖకు చెందిన సీనియర్ పాత్రికేయుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి , సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు గంట్ల శ్రీనుబాబు ఎంపికయ్యారు. ఇందుకు సంబందించిన వివరాలు శనివారం వారి కుటుంబ సభ్యులు తెలియచేసారు. కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు ఆంధ్రపత్రికను స్థాపించి స్వాతంత్ర్య పోరాటంలో అక్షరాయుధాలు అందించారు. దివ్యమైన ఔషదం అమృతాంజనం అయన సృష్టి. శ్యామలా ప్రాధమికోన్నత పాఠశాలను శతాబ్దంకి పూర్వమే స్థాపించి కులమత భేదాలకు తావులేకుండా అన్ని వర్గాలకు, కులాలకు ఉచిత విద్య అందించారు. ఈ పాఠశాలను మహాత్మా గాంధీ మూడుసార్లు సందర్శించారు. ఈ సమయంలోనే ఆయనకు విశ్వదాత అనే బిరుదుతో గాంధీజీ గౌరవించారు. కళాకారుడుగా కూడా ప్రసిద్ధి చెందిన ఆయనకు అన్ని రంగాల్లో నాగేశ్వరరావు పంతులుగారికి ప్రవేశం ఉన్నందునే విద్య, వైద్య, కళా, జర్నలిజం రంగాలలో విశిష్ట సేవలు అందచెసిన ప్రముఖులను విశ్వదాత బిరుదుతో ప్రతియేటా బహుకరించే విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ ప్రకృతి అలారారే అయన స్వగ్రామం పదహారణాల పల్లెటూరు ఎలకుర్రులో ఈ నెల 8వ తేదీ సాయంత్రం జరిగే ప్రధానోత్సవ కార్యక్రమంలో గంట్ల శ్రీనుబాబుకు ఈ పురస్కారాన్ని అతిథులు చేతులు మీదుగా అందచేయటం జరుగుతుందని ఫౌండేషన్ కార్యదర్శి, నాగేశ్వర రావు పంతులు గారి మనుమడు కాశీనాధుని నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఇప్పటికే ఈ అవార్డు ప్రముఖ సినీ దర్శకులు కె. విశ్వనాధ్ లాంటి ప్రముఖులెందరికో ప్రధానము చేసినట్లు నాగేశ్వర రావు తెలిపారు. ఇటువంటి అవార్డు తనకు దక్కడము పట్ల గంట్ల శ్రీను బాబు సంతోషం వ్యక్తము చేసారు.. ఇప్పటి వరకు మూడు రాష్ట్ర ప్రభుత్వ అవార్డు లు,, ఎన్నో జాతీయ, ఇతర పురస్కారంలు స్వీకరించినప్ప టికీ ప్రముఖ కాశీ నాధుని నాగేశ్వరరావు పంతులు అవార్డు రావడం చాలా పూర్వ జన్మ సుకృముగా భావిస్తున్నట్లు శ్రీనుబాబు పేర్కొన్నారు.. ప్రతిష్టాత్మక అవార్డు కు ఎంపిక కావడం పట్ల సీనియర్ జర్నలిస్ట్ లు వివిధ జర్నలిస్ట్ సంఘాలు హర్షము వ్యక్తము చేసారు.

# పీర్ల పంజా భూఆక్రమణపై విచారణ

### శిస్తు చేస్తున్న వారసులు దొంగ పత్రాలు సృష్టించి గ్రామానికి చెందిన భూమి అక్రమణకు చూస్తున్నారు - కొప్పిశెట్టి



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):–** మండలం లో పెద్ద బోధిగల్లం గ్రామానికి సంబంధించిన రెవెన్యూ సర్వేనెంబర్ 143/2 లో 3.06 ఎకరాల పీర్ల పంజా భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్తులు వక్స్ బోర్డు అధికారులు కు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వక్స్ బోర్డు విచారణ అధికారి ఏ.కె నజీర్ సాహెబ్, వక్స్ బోర్డు ఇన్స్పెక్టర్ అహమద్ మొహిద్దీన్ గ్రామస్తులు, గ్రామ పెద్దలు సమక్షంలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరూ ముక్తకంఠం తో ఈ పీర్ల భూమి భూమి గత వంద సంవత్సరాలుగా కౌలుకు మాత్రమే ఇచ్చామని కౌలుదారుడు అన్యాయంగా ఈ భూమిని తన పేరుట తప్పుడు రికార్డు సృష్టించి ఆక్రమించుకుని గ్రామానికి అన్యాయం చేయదలుచుకున్నాడు అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి గ్రామానికి సంబంధించిన ఈ పీర్ల భూమి తమ గ్రామానికి దక్కేలా చర్యలు తీసుకోవాలని విచారణ అధికారికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఇరువైపులా వాదనలు విన్న విచారణ అధికారి ఈ నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల టిడిపి అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ, గ్రామానికి తగిన న్యాయం చేయడానికి తన వంతుగా కృషి చేస్తానని, ఆనాడు 1912లో చల్లా సత్యనారాయణ శాస్త్రి పీర్ల మాన్యానికి ఆ భూమిని గ్రామానికి ఇవ్వడం జరిగిందని, అన్నారు. ఇప్పుడు ఉన్న పెత్తందారుడు కొంతమందికి 20 రూపాయలకి ఆ భూమిని శిస్తు చేసుకోవడానికి ఇస్తే ఈరోజు ఆ భూమికి దొంగ పత్రాలు సృష్టించి ఈ భూమి మాదే అని భూమి పైకి రావడం జరిగిందని, తెలిపారు. ఆనాడు 1998 – 1999 సంవత్సరాల్లో ఈ భూమిపై రెవెన్యూ వారికి పోలీసు వారికి గ్రామస్తులు కంప్లైంట్ చేయగా అప్పుడు రెవెన్యూ వారు వక్ బోర్డు వారు కలిసి ఆ భూమి గ్రామానికి సంబంధించింది అని గ్రామస్తులకే అప్పగించారని అన్నారు. ఆ భూమినీ అప్పుడు ఎవరైతే శిస్తు కి తీసుకున్నారు వారి వారసులు వచ్చి ఆ భూమి మాదంటూ రావడం దారుణమని అన్నారు. పెత్తందారుడు మారడంతో గ్రామానికి చెందిన భూమిని అక్రమించుకుందామని చూస్తున్నారని, అన్నారు. ఈ గ్రామ భూమి విషయంపై హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకొని వెళ్లి న్యాయం చేస్తామని గ్రామస్తులకు వెంకటేష్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మున్నీసాబేగం, అజీమ్,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రెండవ రోజు మన్యం బంద్ ప్రశాంతం




**అరకులోయ, (విశాఖ సమాచారమ్):–** ఆదివాసి గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసి ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు చేపట్టిన రెండవ రోజు మన్యం బంద్ విజయవంతంగా కొనసాగుతుంది.

ఈ బంద్‌కు వివిధ ప్రజా గిరిజన సంఘాల నాయకులతో కలసి బంద్ విజయవంతం గా కొనసాగింది ఈ బంద్ లో స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం, మాట్లాడుతూ గిరిజన స్పెషల్ డిఎస్సీకి ఆర్డినెన్స్ తీసుకురావాలనీ, జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేయాలని, 100% గిరిజన ప్రాంత ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని, ఏజెన్సీలో 100% ఉద్యోగ ఉపాధ్యాయ నియమక చట్టం చెయ్యాలని, ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులు మెగా డీఎస్సీ నుండి మినహాయించాలని, ఏజెన్సీ ప్రాంతంలో మొత్తం 766 టీచర్ పోస్టులు ఆదివాసులకే దక్కేవి కేవలం 42 మాత్రమేనా, గిరిజనేతరులకు దక్కేది 724 ఉద్యోగాల అని అన్నారు. ఏదైతే ఎన్నికల సందర్భంలో సీఎం చంద్రబాబు నాయుడు అరుకు బహిరంగ సభలో జీవో నెంబర్ 3 ని పునరుద్దిస్తామని, అవసరమైతే కోర్టులో ఫైట్ చేస్తామని, లేదా ప్రత్యేకమైన జీవో తీసుకువచ్చి ఇక్కడ ఉండే గిరిజనులకు 100% ఉద్యోగ కల్పన చేస్తామని హామీ ఇచ్చారో ఆ మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు.

# కేసన ధర్మ యుద్ధం విజయవంతం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** కుల గణన జరిపించడం ద్వారా సామాజిక న్యాయాన్ని గెలిపించేందుకు,ధర్మ యుద్ధం చేసిన ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఎట్టకేలకు నేటితో విజయం సాధించారని,ఋ జిల్లా అధ్యక్షులుఋఋ కొనియాడారు. స్థానికుఋ పేటలోని జిల్లా కార్యాలయంలో ఈసారి జరిపే జన గణనతో పాటే సమగ్ర కుల గణన జరుపుతామంటూ కేంద్రమంత్రి మండలి నిర్ణయించడాన్ని హర్షిస్తూ విజయోత్సవ సభ జరిగింది. ఈ సభలోఋ– మాట్లాడుతూ 1931 తర్వాత ఈ దేశంలో కుల గణన జరగలేదని,బీసీల సంక్షేమం అభివృద్ధి కోసం,అనేక దశాబ్దాలుగా "జన గణనతో పాటే సమగ్ర కులగణన" జరపాలని సంఘం అధ్యక్షులు కేసన నేతృత్వంలో అనేకసార్లు అన్ని జిల్లాల ఉన్నతాధికారులకు, చట్టసభల సభ్యులకు,ప్రభుత్వ అధినేతలకు విజ్ఞాపన పత్రాలను ఇవ్వడం జరిగిందన్నారు. దేశాభివృద్ధికి పట్టు గొమ్మలుగా,ఉత్పత్తి కులాలుగా, శ్రామిక వర్గంగా ఉన్న బీసీల సాధికారితకు కులగణన చేయడం అత్యంత కీలకంగా భావించి, శంకరరావు నేతృత్వంలో గల్లీ నుండి ఢిల్లీ వరకు అనేక పోరాటాలు–ఉద్యమాలు నిర్వహించామన్నారు.

ఇటీవల ఏప్రియల్ 27న,ఇదే అంశంపై విజయవాడలో జరిగిన మహా ర్యాలీని పోలీసులు భగ్నం చేసి,మా అధినేత కేసన శంకరరావును,వృద్ధుడనే కనికరం కూడా లేకుండా, బలవంతాన లాక్కెళ్ళి,రోడ్డుపై ఈడ్చుకుంటూ,అడ్డదిడ్డంగా పోలీసు వ్యాన్ లో విసిరేసి,పోలీసు స్టేషన్ లో నిర్బంధించి,మా అధినేతల్ని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఇంత కర్కశంగా వ్యవహరించిన ఆంధ్ర పోలీసుల చర్యకు "కుక్క కాటుకు చెప్పు దెబ్బ"గా కేంద్ర ప్రభుత్వం మా ప్రధాన డిమాండును ఆమోదించడం సంతోషదాయకమన్నారు. అంతేగాక కాంగ్రెస్ కంటే మెరుగ్గా కులగణనను నిష్పాక్షికంగా జరిపించి,ఓబీసీలకు సామాజిక న్యాయాన్ని అందిస్తామంటున్న కేంద్ర మంత్రులకు ధన్యవాదాలన్నారు.

మా అధినేత కేసన శంకరరావు నేతృత్వంలో సాగించిన నిరంతర పోరాటాల ఫలితంగా కేంద్రం దిగివచ్చి,కుల గణనకు సిద్ధపడడం యావత్ భారతీయ బీసీ సమాజం హర్షా మోదాలు తెలియజేస్తుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వం ప్రతి జిల్లా కేంద్రంలోవిశాఖపట్నంలో ఉత్తరాంధ్ర ఉద్యోగుల అద్యక్షులు ఇళ్ల వెంకటేశ్వరరావు ఆద్వర్యంలో రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాస రావు నేతృత్వంలో,కేసన శంకరరావు ప్రధాని నరేంద్ర మోడీ ల 2-3 సైజు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, స్వీట్లు పంచుకుంటూ, మేళ తాళాలతో–యువత నృత్యాలు– కేరింతలతో సంబురాలు జరుపుకోవడ మైనది. ఈసందర్భంగా గ్రేటర్ విశాఖపట్నం అద్యక్షులు మండెం సుభాష్ బోస్ గౌరవఅద్యక్షులు కామన వెంకట సుబ్బారావు జిల్లా అద్యక్షులు పల్లా రమణ, ప్రదాన కార్యదర్శి ఉమ్మడి దేవుల శివ ప్రసాద్ ఉత్తరాంధ్ర పొలిటికల్ జెఎసి కన్వీనర్ గొర్లె శ్రీనివాస నాయుడు ఈరోజు కుల గణనకు కేంద్రం సిద్ధపడిన శుభవేళ,కేసనకు మోడీకి పాలాభిషేకం చేసి,మా ఆనందహేళను పంచుకునేలా సంబురాలు జరుపుకుంటున్నామన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నేతలు పాల్గొని తమ హర్షాతిరేకాలను తెలియజేశారు.

# విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డీఎస్సీ - సోషల్ (స్కూల్ అసిస్టెంట్)

### స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణం( 10 వ తరగతి)

11. రాజ్యాంగ సభ 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించింది . రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమల్లోకి వచ్చింది.

12. ముసాయిదా రాజ్యాంగం లో 350 అధికరణాలు , 8 షెడ్యూళ్ళు ఉన్నాయి.

13. అమెరికా ప్రభుత్వాన్ని అధ్యక్ష వ్యవస్థ ప్రభుత్వం అంటారు.

14. భారత రాజ్యాంగం పార్లమెంటరీ ప్రభుత్వాన్ని ప్రతిపాదించింది.

15. అమెరికాలో అధ్యక్ష వ్యవస్థ ప్రభుత్వం లో కార్యనిర్వాహక వర్గానికి అధిపతిగా అధ్యక్షుడు ఉంటాడు.

16. భారత రాజ్యాంగంలో అధ్యక్షుడు బ్రిటిష్ రాజ్యాంగంలోని రాజు స్థానంలో ఉంటాడు.

17. భారత ప్రెసిడెంట్ రాజ్యానికి అధిపతి కానీ కార్యనిర్వహక వర్గానికి కాదు, దేశానికి ప్రాతినిధ్యం వహిస్తాడు కానీ దేశాన్ని పాలించడు.

18. భారతదేశంలో ఒకే పౌరసత్వం ఉంటుంది. రాష్ట్రాల పౌరసత్వం ఉండదు.

19. దేశంలోనే చట్టాలు చేసే అంశాలను మూడు జాబితాలుగా వర్గీకరించారు :1. కేంద్ర జాబితా, 2.రాష్ట్రాల జాబితా , 3.ఉమ్మడి జాబితా.

20. కేంద్ర జాబితాలోని అంశాలపై కేంద్రం మాత్రమే చట్టాలు చేయగలదు.రాష్ట్ర జాబితాలోని అంశాలపై రాష్ట్ర మాత్రమే చట్టాలు చేయగలదు. ఉమ్మడి జాబితాలోని అంశాలపై రాష్ట్రాలు , కేంద్రం చట్టాలు చేయవచ్చు. అయితే కేంద్రం చేసే చట్టానికి విరుద్ధంగా రాష్ట్రం చట్టం చేస్తే కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టమే చెల్లుబాటవుతుంది.

21. చట్టాలను , రాజ్యాంగంలోని అధికరణాలను సవరించడానికి అవకాశం భారత రాజ్యాంగం కల్పించింది.

22. శాసనసభలలో సగం కంటే ఎక్కువ మంది ఆమోదంతో తరచూ చట్టాలు చేయవచ్చు : అయితే రాజ్యాంగంలోని అధికరణాల సవరణను పార్లమెంట్ మాత్రమే చేపట్టాలి. అంతేకాకుండా రాజ్యసభ, లోక్ సభల రెండింటిలో మూడింట రెండు వంతుల సభ్యుల ఆమోదం అవసరం.

21. కొన్ని అధికరణాలను రాష్ట్ర శాసన సభలు అంగీకరించిన తర్వాత (లేదా రాటిఫై చేసిన తర్వాత) మాత్రమే సవరించవచ్చు. కొత్త చట్టాలను దేశ అధ్యక్షుడు కూడా ఆమోదించాల్సి ఉంది

(ఇంటర్మీడియట్)

22. 1976 లో 42 వ సవరణ ద్వారా రాజ్యంగ ప్రవేశికలో 'లౌకిక', సామ్యవాద ' అనే పదాలను చేర్చారు.

23. రాజ్యాంగంలోని కొన్ని అంశాలను ఎట్టి పరిస్థితులలోనూ సవరించడానికి వీలులేదని కేశవానంద భారతి తీర్పు చెప్పింది.

24. ప్రారంభంలో భారత రాజ్యాంగంలో 365 నిబంధనలు , 8 షెడ్యూళ్ళు ఉన్నాయి.

25. 'మానవుడు సంఘజీవి' అన్నది గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్.

26. భారత రాజ్యాంగం లిఖిత రాజ్యాంగం , బ్రిటిష్ రాజ్యాంగం అలిఖిత రాజ్యాంగం.

27. భారత రాజ్యాంగంలో 13వ ప్రకారణ రాజ్యాంగం యొక్క ఔన్నత్యాన్ని గూర్చి వివరిస్తుంది.

28. భారత రాజ్యాంగం 3వ భాగం 4వ భాగం (ఎ)లు రాజ్యం – పౌరుల మధ్య పరస్పర సంబంధాన్ని సూచిస్తాయి.

29. ఆదేశ సూత్రాల ప్రస్తావన భారత రాజ్యాంగం నాలుగో భాగంలో ఉంటుంది.

30. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన ప్రారంభం – క్రీ.శ. 1600

31. రెగ్యులేటింగ్ చట్టం – 1773 , ఫిట్స్ ఇండియా చట్టం – 1793

32. భారత ప్రథమ స్వాతంత్ర పోరాటం లేదా సిపాయిల తిరుగుబాటు (1857 ) ఫలితంగా ఈస్ట్ ఇండియా కంపెనీ దద్దయింది.

33. భారతదేశ పరిపాలన పగ్గాలు బ్రిటిష్ రాణి ఆధీనంలోకి ఉంచేందుకు భారత ప్రభుత్వ చట్టం 1858 రూపొందించబడింది.

34. భారత ప్రభుత్వ చట్టం 1919 భారతదేశంలో కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజనకు , ద్వంద్వ ప్రభుత్వ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

35. సైమన్ కమిషన్ (1927 )అఖిల భారత సమాఖ్య ఏర్పాటను వ్యతిరేకించింది.

36. మొదటి రౌండ్ టేబుల్ సమావేశం 1930లో, రెండవ రౌండ్ టేబుల్ సమావేశం 1931లో, మూడవ రౌండ్ టేబుల్ సమావేశం 1932లో లండన్ లో నిర్వహించబడ్డాయి

37.1946 లో రాజ్యాంగ పరిషత్తు ఏర్పడింది.

38. రాజ్యాంగ పరిషత్తు మొదటి సమావేశం 1946 డిసెంబర్ 9న జరిగింది.

38. రాజ్యాంగ పరిషత్తు మొత్తం సభ్యత్వ సంఖ్య 385 కాగా అందులో 292 స్థానాలు బ్రిటిష్ ఇండియా పాలిత రాష్ట్రాలకు , 93 స్థానాలు స్వదేశీ సంస్థానాలకు కేటాయించడమైంది.

39. భారత రాజ్యాంగం రాయడానికి పట్టిన సమయం– 2 సంవత్సరాల , 11 నెలల , 18 రోజులు.

40. భారత రాజ్యాంగ ముసాయిదా సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ . ఈయనకు ముసాయిదా రచనలో సహాయ సహకారాలను అందించిన ప్రముఖ న్యాయవాదులలో అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, ఎన్ . గోపాలస్వామి అయ్యంగార్, కె. ఎం మున్షి , టీటీ కృష్ణమాచారి వంటి వారు ఉన్నారు

41. భారత రాజ్యాంగ పరిషత్తు భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26వ తేదీన ఆమోదించింది . 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చింది. ప్రతి ఏటా జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది .

42. భారత రాజ్యాంగ ముసాయిదాలో 350 అధికరణాలు, 13 షెడ్యూళ్ళు ఉన్నాయి. తరువాత భారత రాజ్యాంగ అధికృత ప్రతిలో 395 అధికరణాలు , ఎనిమిది షెడ్యూళ్ళుగా మార్చడం జరిగింది.

– డా.పి.వి.రామ్, ఎం.ఏ, బి.ఈడి, పి.హెచ్.డి

విశాఖ సమాచారమ్ 9553574250

# గిరిజనులను మభ్య పెడుతున్న వైసిపి

## జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** జిఓ నెంబర్ 3 విషయంలో వైసీపీ నాయకులు గిరిజనులను మభ్యపెడుతున్నారని మాజీ మంత్రి జి సి సి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2020 లో జగన్ ప్రభుత్వం వైఫల్యం కారణంగా జిఓ నెంబర్ 3 రద్దు అయింది.

జిఓ నెంబర్ 3 కోసం మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదని పేర్కొన్నారు. గిరిజనులకు లబ్ధి చేకూర్చే జీవో నెంబర్ 3 ని రద్దు చేస్తుంటే వైసీపీ నాయకులు ఎం చేశారు అని ప్రశ్నించారు. జీవో నెంబర్ 275, జీవో నెంబర్ 3 తీసుకువచ్చి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేసింది టీడీపీ ప్రభుత్వమేనని అన్నారు.

జిఓ నెంబర్ 3 పై వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ కి వెళ్లి ఎందుకు మాట్లాడడం లేదు.

ఎమ్మెల్యే లకు చిత్తశుద్ధి ఉంటే పదవులకు రాజీనామా చేసి పోరాటం చేయాలని హితవు పలికారు . గత ఐదు సంవత్సరాలలో స్పెషల్ డి ఎస్ సి నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేకపోయారు. నాయకులు మంచి కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలి బురదజల్లే కార్యక్రమాలు కోసం కాదు అని ఎద్దేవా చేశారు. గిరిజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

వైసీపీ నాయకులను నమ్మి గిరిజనులు మోసపోవద్దు అని తెలిపారు .

# నర్సీపట్నం నియోజకవర్గంలో మరో 6 రోడ్ల పనులకు అనుమతి తెచ్చిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):-** నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన ప్రత్యేక కృషితో రోడ్లు భవనాల శాఖ నాబార్డ్ గ్రాంట్ నిధుల కింద రూ.5.30 కోట్ల విలువైన ఆరు రోడ్ల పనులకు అనుమతి మంజూరయింది. నాతవరం నుంచి తూర్పుగోదావరి జిల్లాకు వెళ్లే మార్గంలో గుమ్మిడిగొండ గ్రామం మీదుగా 4.5 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి చేయడం, కోటఉరట్ల మండలం కైలాసపట్నం నుండి మాకవరపాలెం మండలం గిడుతూరు వరకు 9.6 కిలోమీటర్ల రోడ్డును మరమ్మతు చేయడం, గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామం నుండి పాకలపాడు మీదుగా పుత్తడి గైరంపేట వరకు 5.1 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి, ఎ.ఎల్.పురం నుండి కొంకసింగి వరకు 3.1 కిలోమీటర్ల రోడ్డు పనులు.

నర్సీపట్నం మండలం బయ్యపురెడ్డిపాలెం నుండి లింగాపురం, వెంకటాపురం మీదుగా కోడవటిపూడి వరకు 6.6 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి చేయడం, వేములపూడి నుండి అమలాపురం, కన్నంపేట మీదుగా వెలగపూడి వరకు 6 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతు చేసే పనులు మంజూరయ్యాయి. ఈ రోడ్ల అభివృద్ధి పనులు పూర్తయిన తరువాత నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి. గ్రామీణ ప్రాంతాలకు మంచి సంబంధాలు ఏర్పడతాయి.

గత రెండు రోజుల క్రితం గౌరవ స్పీకర్ అయ్యన్న పాత్రుడు చొరవతో రూ.6.55 కోట్లతో 9 రోడ్డు పనులకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ కొత్త 6 పనులతో కలిపి, ఆయన నిరంతర కృషితో ఇప్పటి వరకు నర్సీపట్నం నియోజకవర్గానికి 10 నెలల కాలం లో రూ.117 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకు రావడంలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు విజయవంతం అయ్యారనే చెప్పాలి.

# స్పెషల్ డీఎస్సీ సాధన ఏజెన్సీ బంద్ విజయవంతం



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఐటీడీఏ పరిధిలో స్పెషల్ డీ ఎస్సి ప్రకటించి,100 శాతం గిరిజనుల కే టీచర్ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గిరిజన ,ఉద్యోగ, ప్రజా సంఘాల పిలుపు తో జరిగినరెండో రోజు బంద్ విజయవంతమైంది.ఆందోళన కారులు రోడ్ల పైకి వచ్చి,బంద్ పటిష్టం గా నిర్వహించారు.

వ్యాపార సంస్థలు, ప్రభుత్వా కార్యాలయాలు స్వచ్ఛంధ మూసి వేసి ,బంద్ కు సహకారం అందించారు.ఈ గిరిజన సంఘము నాయకులు సాగేని ధర్మన్న పడాల్ మాట్లాడుతూ...881 టీచర్ పోస్టులకు గానూ గిరిజనుల కు,కేవలం 30 ఉద్యోగాలు కేటాయించడం అన్యాయమన్నారు. గత వైసీపీ జగన్ ప్రభుత్వం లో జీవో నంబర్ 3 సుప్రీంకోర్టు రద్దు చేసిన ,7 గురు మంది ఎమ్మెల్యేలు,1 ఎంపీ,కార్పొరేషన్ చైర్మన్ లు,ఎస్టీ కమిషన్ చైర్మన్ లు,సభ్యులు ఏనాడు జీవో నంబర్ 3 కోసం ఆలోసించలేదన్నారు.ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం కూడ అన్యాయానికి తల పెట్టిందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరకు ఎన్నికలసభలో జీవో నంబర్ 3 అమలు చేసి ,ఏజెన్సీ లో నూటికి,నూరు శాతం గిరిజనుల కే ఇస్తామని,ఇచ్చిన హామీ నీ నిలబెట్టుకోవాలన్నారు.అంతవరకూ నిరంతరం ఆందోళన కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో,గిరిజన సంఘం నాయకులు సాగెని ధర్మన్న పాడా ల్ ఎం నారాయణ రాజు. వైస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షులు గబ్బా డి శేఖర్.ఎన్ మత్య కొండం నాయుడు.ఎం పి టి సి సన్యాసి దొర. రమణమూర్తి.కిముడు గణేష్. సెగ్గే లక్ష్మణ్ శోభన్ బాబుడీ స్సీ అభ్యర్థులు ఉద్యోగులు యువకులు పాల్గొన్నారు.

# బాలికలకు భరోసా "కిషోర వికాసం"



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** వేసవి లో బాలికల కు భరోసా కల్పించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో వివిధ శాఖల తో " కిశోర వికాశం" ఏర్పాటు చేయనున్నట్లు రావికమతం ఐసిడిఎస్ సి.డి.పి.ఓ ఎస్. పుష్పదేవి తెలిపారు. బుచ్చయ్యపేట స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం కిశోర వికాసం పై వివిధ శాఖలతో సమావేశం నిర్వహించారు. అంగన్వాడి, మహిళా పోలీస్, ఎం.ఎల్.హెచ్.పి, ఆశ, వెలుగు విఓ లతో గ్రామస్థాయిలో గ్రూపులు ఏర్పాటు చేసి, మే 2 నుండి జూన్ 10 వరకు 11-18 సంవత్సరాలు వయస్సు గల కిశోర బాలికలకు వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

కిషోర బాలికలకు భరోసా కల్పించేందుకు సూచనలు, అవగాహన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వి. విజయలక్ష్మి ,వెలుగు ఏపీఎం టి. రాజబాబు, మెడికల్ సూపర్వైజర్ ఎం. త్రిమూర్తిలు, ఐసీపీస్ లక్ష్మి అంగన్వాడీ సూపర్వైజర్ లు ఏ. రత్నం, బి. సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# "లేటరైట్ మళ్లీ తవ్వకాలు " అనే అంశంపై అందోళన చెందుతూ మంత్రికి గిరిజనుల వినతి

కలెక్టర్ తో మాట్లాడి అభిప్రాయ సేకరణ ఆపమని చెప్పినట్లుగా వివరించిన మంత్రి సంధ్యారాణి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** స్త్రీ & శిశు శాఖ మరియు గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని గిరిజన నాయకులు కలుసుకుని, గూడెంకొత్తవీధి మండలంలో జరుగుతున్న లేటరైట్ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. తవ్వకాలు వలన పర్యావరణ కాలుష్యం, వనరుల ధ్వంసం, భూగర్భ జలాల హాని, పశు-వ్యవసాయ నష్టానికి దారితీస్తున్నాయని వారు వివరించారు. గిరిజన హక్కులు, జీవనాధారాల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని వారు మంత్రి గారిని కోరారు.

మంత్రి స్పందించి, అభిప్రాయ సేకరణ ఆపించాం.. తదుపరి విచారణ చేపడతామని హామీ ఇచ్చారు.

# గ్రామం లో మురికి కాలువలు శుభ్రం చేయాలి: కోన లక్ష్మణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** మండలం లోని మూలపేటలోని పూడివారి వీధిలో మురికి కాలువ సమస్యను పరిష్కారిచాలని గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఆయన గ్రామం లో మురికి కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీపై వేసిన పలకలు శిథిలావస్థకు చేరడంతో వాటి కింద చెత్తచెదారం పేరుకుపోయి చిన్న పాటి వర్షం కు మురికి నీరు ఇళ్లు లోపలికి వస్తోందని వాపోయారు. అలాగే డ్రైనేజీ నుంచి వస్తున్న దుర్వాశన భరించ లేకపోతున్నామని. సత్యనారాయణ గ్రామ పంచాయతీ అధికారులకు ఈ సమస్య పై అనేక సార్లు విన్న వించుకున్న పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కారం చేయకుంటే గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తాం అన్నారు.

# వీధిలైట్లకు మరమ్మత్తులు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** జీవీఎంసీ 79 వ వార్డు పరిధి లంకెలపాలెం ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై లైట్లను శనివారం మరమ్మత్తులు చేయించిన కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ , ఈనెల 6న జరగనున్న మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా గ్రామం లో అన్ని ప్రాంతాల్లో వెలగని వీధిలైట్లకు మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరుగు శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండగ కు సర్వం సిద్ధం చేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా యూత్ అధ్యక్షుడిగా శ్రావణ్ కుమార్



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు పరవాడ మండల పార్టీ యువజన విభాగం యూత్ అధ్యక్షులు గా అనకాపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ స్వర్గీయ కూండ్రపు ముత్యాల నాయుడు మనవడు బండారు శ్రావణ్ కుమార్ నియమితులైన శుభ సందర్భంగా ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణం నాయుడు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కూండ్రపు కృష్ణం నాయుడు మాట్లాడుతూ ప్రముఖ వ్యాపారవేత్త బండారు శ్రావణ్ కుమార్ యువజన విభాగం ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న సేవలు గుర్తిస్తూ పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సిఫార్సు మేరకు బండారు శ్రావణ్ కుమార్ ను యువజన విభాగం పరవాడ పార్టీ యూత్ అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కు,కృతజ్ఞతలు తెలియజేశారు.

# శ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి జాతర గోడపత్రిక ఆవిష్కరణ



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం ప్రజల ఆరాధ్య దేవత శ్రీ శ్రీ ముత్యాలమ్మతల్లి అమ్మవారి జాతర గోడ పత్రికను శనివారం జనసేన పార్టీ ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్ ఆవిష్కరించారు. పండుగను ఈనెల 20 తారీఖున మంగళవారం మనంగా నిర్వహిస్తున్నామని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షులు రాష్ట్ర మత్స్యకార సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతకాయల సుజాత ముత్యాలు తెలిపారు. జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, స్థానిక పెద్దలు, నాయకులు, యువకులు, ప్రజలు ముత్యాలమ్మ జాతర మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు వియ్యపు చిన్నా , జనసేన పార్టీ మండల అధ్యక్షులు బొద్దపు శ్రీనివాస్ కాసులు, పూజారి చింతకాయల ముత్యాలు, దాసుడు సూరాడ దినేష్, కులపెద్ద మైలపల్లి మహేష్ , దిబ్బపాలెం పూజారి చింతకాయలు గుడ్డి మసేను , దిబ్బపాలెం దాసుడు అర్జిల్లి సోములు,జాలారిపేట పిల్లగోడు ఒలిశెట్టి సింహాచలం, ముత్యాలమ్మపాలెం ఎంపిటిసి అర్జిల్లి దేవిరవి, మండలం కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, వైస్ ప్రెసిడెంట్ సూరాడ పెంటయ్య, మాజీ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, స్థానిక పెద్దలు, చింతకాయలు సోములు, ఒలిశెట్టి అప్పలరాజు, చింతకాయల రాము , స్థానిక నాయకులు, పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నూకంబిక ఉత్సవాలు విజయవంతం

చేసిన అందరకు ధన్యవాదాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఉత్సవాలు విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవాల ప్రత్యేక అధికారి శోభారాణి, ఉత్సవ కమిటీ చైర్మన్. పీలా నాగశ్రీను, (గొల్ల బాబు)ఆలయ కార్యనిర్వహణాధికారి వేంపల్లి రాంబాబు తదితరులు విలేకరులతో మాట్లాడారు . నెలరోజుల నూకాంబికా జాతరను ఘనంగా నిర్వహించడంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలుతెలియజేశారు. ఈఏడాదిగణనీయంగా ఆదాయం పెరిగిందని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాయించనీయ సంఘటనలు జరగకుండా సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు . రాబోయే రెండు నెలలు కూడా పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలి వస్తారని వారికి కూడా తగిన సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నిత్యయాత్రా స్థలంగా నూకాంబిక అమ్మవారి ఆలయం అభివృద్ధి చెందుతుందని తెలిపారు ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించడానికి కృషిచేసిన శాసనసభ్యులు రామకృష్ణ కి ఈ సందర్భంగా సమావేశం లో కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్టీఆర్ స్టేడియంలో నెల రోజులు పాటు జరిగిన జాతర సంబరాలకు పూర్తి ఖర్చులు శాసనసభ్యులు భరించారని తెలిపారు. సహకరించిన జనసేన ఇన్చార్జి భీమర శెట్టి రాంకీ కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు దాడి రవికుమార్ ఆనంద్ సురేసతీష్, మారిశెట్టి శంకర్ రావు, కొడుకుల శ్రీకాంత్ కాండ్రేగుల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** నగరంలోని 32వ వార్డులో బాల్య వివాహాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డా. కందుల నాగరాజు గారు మాట్లాడుతూ, బాల్య వివాహాలను నిర్మూలించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాలు పిల్లల ఆరోగ్యంపై, విద్యపై, భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. తల్లిదండ్రులకు దీనిపై అవగాహన కల్పించడం అత్యవసరమని, బాల్య వివాహాల నిషేధ చట్టం - 2006 ప్రకారం బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, దానికి గరిష్ఠంగా రెండు సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ.1,00,000 వరకు జరిమానా విధించవచ్చని పేర్కొన్నారు.

ఇలాంటి సంఘటనలు ఎక్కడైనా గమనించినట్లయితే వెంటనే 112 లేదా చైల్డ్ లైన్ 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని స్పష్టం చేశారు. హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటుతో పాటు, గ్రామస్థాయినుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో చర్యలు తీసుకుంటే బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టవచ్చన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కె, ఎడబ్ల్యుడబ్ల్యు, ఆశ కార్యకర్తలు, వాసవి మహిళా మండలి సభ్యురాలు టి. శర్మిల, అంగన్‌వాడీ టీచర్లు ఆర్.టి.ఎల్ మంగరాజు, టి. పార్వతి, పి. గౌతమి, ఎం. బిందు, డబ్ల్యుడబ్ల్యుపి.ఎస్ సభ్యులు, ఏ.సరోజ, ఎస్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా కోట మూడు శాతంకు పెంపు హర్షణీయం

## జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రంలో డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో క్రీడల కోటా ను మూడు శాతం కు పెంచడం హర్షణీయం అని అనకాపల్లి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు చిరికి వెంకట్రావు, కే.ఎం. నాయుడు పేర్కొన్నారు. అనకాపల్లిలో శనివారం జరిగిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. క్రీడాకారులు, క్రీడాభిమానుల 30 ఏళ్ళ కోరిక ఎట్టకేలకు నెరవేరిందన్నారు. నిర్ణయం తీసుకున్న కూటమి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కృషి చేసిన, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. భవిష్యత్తులో జరగబోయే అన్ని నియామకాల్లోనూ మూడు శాతం క్రీడా కోటాను అమలు చేయాలన్నారు. పదోన్నతుల్లో కూడా మూడు శాతం క్రీడా కోటాను అమలు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో రాష్ట్రంలో క్రీడలు, వ్యాయామాభివృద్ధికి దోహదపడు తుందన్నారు. ప్రవేశ పరీక్షల ఫలితాలతో నిమిత్తం లేకుండా క్రీడల్లో ఉన్న ప్రతిభ ఆధారంగా నేరుగా ఉద్యోగ నియామకాలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి చేస్తున్న అన్ని కార్యక్రమాలకు తాము కూడా సహకరిస్తామన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు, సంఘ ప్రతినిధులు ఎస్.శ్రీనివాసరావు, పీ.వీ.నాయుడు, జి శ్యామ్ ప్రసాద్, గాలి రాజు, బొబ్బిలి అప్పలరాజు, ఎన్. ఎస్. రాజా, ఎస్వీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## సాయి సంజీవిని జిమ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** యువత వ్యాయం పట్ల శ్రద్ధ చూపడం వలన శరీరధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా పొందుతారని సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. దక్షిణ నియోజకవర్గం లో డాబా గార్డెన్స్ వద్ద శారదా వీధిలో ఏర్పాటైన సాయి సంజీవిని జిమ్‌ను సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాయామం అలవాటు చేసుకుని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. రోజులో కనీసం కొంత సమయం వ్యాయామానికి కేటాయించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, నిర్వాహకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతరం 33 వార్డ్ జనసేన పార్టీ నేత వేగి వెంకట అప్పారావు గృహ ప్రవేశ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, జనసేన ఫ్లోర్ లీడర్ శ్రీమతి వసంత లక్ష్మి జి కె తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శ్రీ శివ గారు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## గాలి వర్షానికి కూలిన ఇంటి పైకప్పు




**కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):-** మండలం లో శనివారం వీచిన జోరు గాలి మరియు వర్షానికి , కొమ్మిక పంచాయతీ, కొత్త బొర్రంపేట గ్రామానికి చెందిన ముగ్గురు రైతుల ఇల్లు, ఇంటి పైకప్పు భాగం 3 గంటల సమయంలో కూలి నేలమట్ట మయ్యాయి. దీంతో బాధితుల ఇంట్లో నిత్యావసర వస్తువులు, తదితర సామాన్లు వర్షం నీటికి తడిసి పాడైనట్లు చెబుతున్నారు. మఠ్రి అప్పారావు, మఠ్రి బాబురావు, మఠ్రి శంకర్ లకూ చెందిన రేకులు పూర్తిగా ధ్వంసం అయినట్లు బాధితులు తెలిపారు.ప్రభుత్వ అధికారులు స్పందించి, ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## డీసీఎంఎస్ చైర్మన్ బాలాజీకి సత్కారం



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ ని నూతనంగా విశాఖ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ గా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు సిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, పృధ్వీ, ప్రదీప్, టీడీపీ బుచ్చయ్యపేట మండలం యాదవ సంఘం అధ్యక్షుడు సింగంపల్లి రమేష్ మర్యాదపూర్వకంగా కోట్ని బాలాజీ ని కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేసి సాలువతో సత్కరించి చిత్రపటాన్ని బహుకరించారు. 2013లో తెలుగు నాడు విద్యార్థి సంఘం (టీఎన్ఎస్ఎఫ్) కోట్ని బాలాజీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షునిగా వ్యవహరించారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. పార్టీకి బాలాజీ అందించిన సేవలకుగాను ప్రభుత్వం డీసీఎంఎస్ చైర్మన్ గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## జనసేన పార్టీ కార్యకర్తలకు కిట్లు పంపిణి



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):-** జనసేన పార్టీ కార్యకర్తలకు అండగా వుండాలనే ఉద్దేశ్యం తో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ప్రమాద బీమాను కల్పించిందని మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్యామ్ కిషోర్ అన్నారు. కార్యకర్తలకు ఆకస్మికంగా ప్రమాదంలో గాయపడినా, మరణించినా ప్రమాద బీమా వుండాలనే ఉద్దేశ్యం తో 500 రూపాయలు తో 5 లక్షలు ప్రమాద బీమా అందించారని చెప్పారు. నక్కపల్లి సుబ్బిరామి రెడ్డి కళ్యాణ మండపం లో ఇన్చార్జి గెడ్డం బుజ్జి, సీనియర్ నాయకులు తోట నగేష్, రాష్ట్ర కార్యదర్శి సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ బోడపాటి శివదత్ ల ఆద్వర్యం లో క్రియాశీలక వాలంటీర్లకు కిట్లు అందజేశారు, అనంతరం సభ్యత్వం తీసుకున్న వారందరికీ ఉద్దండ పురం గ్రామం లో ఇంటింటికి అందజేశారు. ఈ కార్యక్రమం లో కొమర్తి గోవిందు, బోడ్డా దివాకర్, తుమ్మల శ్రీను, కుర్ర అయ్యప్ప, పాలూరి అనిల్ , అదిమల్ల శివలకు కిట్లు పంపిణీ చేశారు.

# విశాఖలో అశోక్ చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులో గత 16 సంవత్సరాలుగా సేవలందిస్తూ గుర్తింపు పొందిన అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తన మొట్టమొదటి శాఖను విశాఖపట్నంలోని గాజువాకలోని చిన గంట్యాడలో శనివారం ఉదయం ప్రారంభించింది. ఈ కార్య క్రమానికి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు అయిన పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా ప్రతిష్టాత్మకమైన అశోక్ చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభించడం శుభపరిణామం అని అన్నారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ రాహుల్ గల్వే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎప్పటినుండో తమ కేంద్రాలు ప్రారంభించాలని అనుకుంటున్నామని ఆ క్రమంలోనే శరవేగంగా అభివఅద్ధి చెందుతున్న విశాఖ నగరంలో తమ మొదటి శాఖలను నేటి ప్రారంభించామని అన్నారు తమ కేంద్రంలో చిన్న పిల్లలకు స్పీచ్ థెరపీ మ్యానువల్ థెరపీ వంటి శిక్షణ ద్వారా పిల్లల బంగారు భవిష్యత్తులో తీర్చిదిద్దడానికి అనుభవజ్ఞులైన నిపుణులను నియమించడం జరిగిందని, అంతేకాకుండా విశాఖపట్నంలోని పిల్లలకు ఉత్తమ సేవలు అందించాలని తమ సంకల్పాన్ని నెరవేరుస్తూ తమకు సహకరించాలని కోరారు. మరో వ్యవస్థాపక డైరెక్టర్ కిరణ్ కుమార్ గల్వే మాట్లాడుతూ తమ వద్ద ఆర్టిజం ఏడిఎస్డి, లెర్నింగ్, డిజేబులిటీ వంటి సమస్యలు ఉన్న చిన్న పిల్లలు కనిపించడానికి సాధారణంగానే ఉన్నప్పటికీ తేడాగా ప్రవర్తిస్తుంటారని, తాము అడిగే ప్రశ్నలకు ఆలస్యంగా సమాధానం చెబుతుంటారని ఇవన్నీ కూడా మానసిక ఎదుగుదలకు సంబంధించినవని ఆయన అన్నారు. అటువంటి మానసిక ఎదుగుదల లేని పిల్లలకు తమ వద్ద తొమ్మిది నుండి పది రకాల థెరపీలు అందుబాటులో ఉన్నాయని, దేశవ్యాప్తంగా ఎక్కడికి వెళ్లినా ఒకటో రెండో థెరపీ అందుబాటులో ఉంటాయని కానీ ఇవన్నీ కూడా ఒకే సెంటర్లో అందుబాటులో ఉండడం చాలా అరుదని ఆయన అన్నారు. పిల్లల మానసిక స్థితిని బట్టి వారికి అవసరమైన థెరపీలు అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. విశాఖపట్నం నుండి చాలామంది తమ పిల్లలను వైద్యానికి హైదరాబాద్ తీసుకొచ్చేవారని ఈ క్రమంలోనే తమ శాఖ ను విశాఖలో ప్రారంభించడం జరిగిందని తెలిపారు. తద్వారా అశోక చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ సేవలు విశాఖ వాసులకు మరింత చేరువ చేయటమే కాకుండా పిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక భారం కూడా తగ్గుతుందని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరిన్ని శాఖలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థక డైరెక్టర్లు డాక్టర్ కిరణ్ కుమార్ గుల్వే, డాక్టర్ సచిన్ కుమార్ గుల్వే, చైల్డ్ సైకాలజిస్ట్ డాక్టర్ నవిత రాహుల్ గుల్వే, స్థానిక కార్పొరేటర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ ఆయుష్మాన్ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ గత ఐదు రోజులుగా సమ్మెబాట పట్టిన సంగతి తెలిసిందే. స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా నిర్వహిస్తున్న ఈ సమ్మెను ఉద్దేశించి శనివారం యూనియన్ నాయకులు మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఆరు సంవత్సరాలు దాటిన ప్రతి సిహెచ్ఓను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో సమానంగా 23% వేతన సవరణ చేయా లని, ప్రతి సంవత్సరం 5% ఇంక్రిమెంట్, పని ఆధారత ప్రోత్సాహకాలు, ఈపీఎఫ్ఓ పునరుద్ధరించాలని, డిమాండ్లపై ఈ ఆందోళన నిర్వహించారు. జిల్లాలోని 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిహెచ్వోలు సమ్మె లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కోశాధికారి, ఏపీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వి.వి. శ్రీనివాసరావు సంపూర్ణ మద్దతును తెలియజేసి సిహెచ్ఓ ల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రభుత్వాలు తక్షణమే డిమాండ్లు పరిష్కారానికి చర్చలు జరిపి ప్రజా సేవలు పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఆరోగ్యం రోడ్డున పడినా అధికారులు పట్టించుకోక పోవడం శోచనీయం అన్నారు. గ్రామీణ ఆరోగ్య కార్యక్రమాలు ముందుకు నడిపిం చిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను వారికి వర్తించవలసిన న్యాయమైన కోరికలను పెడచెవిన పెట్టడం అమానుషం అన్నారు. తక్షణమే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## భీమవరంలో దారుణం.. నడిరోడ్డుపై కత్తిపట్టుకుని



**పశ్చిమగోదావరి:** మతిస్థిమితం లేని వ్యక్తులు ఎప్పుడు ఎలా ఉంటారో వారికే తెలియదు. వారిని ఎంతకనిపెట్టుకుని ఉన్నప్పటికీ ప్రమాదకర పరిస్థితులను తెచ్చిపెట్టుకుంటారు. తమను తాము హానీ చేసుకోవడమో.. లేక ఇతరులపై దాడి చేయడమో చేస్తుంటారు. ఇలాంటి వాళ్లు రోడ్లపైకి వస్తే జనం పరిస్థితి ఇక అంతే. ఏ క్షణంలో ఏం చేస్తారో తెలియక భయాందోళనకు గురవుతుంటారు. అయితే భీమవరంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి చేసిన పనితో ప్రజలు వణికిపోయారు. అతడి దగ్గరకు వెళ్లాలంటేనే భయపడిపోయారు. ఇంతకీ అతడు ఏం చేశాడు.. ప్రజల భయాందోళనకు కారణమేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

జిల్లాలోని భీమవరంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి రోడ్డుపై హల్‌చల్ చేశాడు. అతడు చేస్తున్న పని చూస్తి అంతా అవాక్కయ్యారు. ఏం జరుగుతుందో తెలిసే లోపే అతడు రక్తపుమడుగులో పడి ఉన్నాడు. అతడి దగ్గరకు వెళ్లడానికి కూడా ఎవరూ సాహసం చేయలేకపోయారు. ఆ వ్యక్తి చేస్తున్న పనిని చూస్తూ కూడా ప్రజలు, స్థానికులు పట్టించుకోలేదు. చివరకు అందరూ చూస్తుండగానే ఆ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు.

శనివారం ఉదయం నడిరోడ్డుపై వచ్చిన మతిస్థిమితం లేని వ్యక్తి తనతో పాటు కత్తిని తెచ్చుకున్నారు. జనాల మధ్యలో నిలబడి తన పీకను తానే కోసుకునేందుకు ప్రయత్నించాడు. ఇదంతా కూడా అక్కడే ఉన్న జనం చూస్తున్నప్పటికీ కూడా దగ్గరకు వెళ్లలేదు. అతడు చేసే పనిని చూస్తూ నిలబడ్డారే తప్ప ఆపే ప్రయత్నమూ చేయలేదు. దీంతో ఆ మతిస్థిమితం లేని వ్యక్తి నడిరోడ్డుపై పీకకోసేసుకున్నాడు. తీవ్ర రక్తస్రావం అవడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. పరిస్థితి విషమించడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఉండికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అయితే సదరు వ్యక్తి తొలుత యనమదుర్రు డ్రైన్‌లోకి దూకగా.. అతడిని పోలీసులు రక్షించారు. ఆ తరువాత మల్లిప్లెక్స్ ఎదుట కత్తితో హల్‌చల్ చేశాడు. కాలు దగ్గర కోసుకున్నాడు కూడా. అనంతరం పీకకోసుకోవడంతో ఆ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి వివరాలు సేకరించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు పోలీసులు.

## రేషన్ కార్డుదారులకు నో చింత.. గడువు పెంచిన సర్కార్



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. కొత్త రేషన్‌కార్డులను జారీ చేసేందుకు కసరత్తు చేపట్టిన సర్కార్.. కార్డుల జారీకి ముందు రేషన్‌కార్డుకు ఈ కేవైసీ ప్రక్రియను మొదలుపెట్టింది. ఇందుకోసం ఓ గడువును కూడా విధించింది. ఏప్రిల్ 30 వరకు రేషన్ కార్డు ఈ కేవైసీ చేసుకునేందుకు గడువు విధించింది సర్కార్. అయితే ఏప్రిల్ 30 తేదీ దాటినప్పటికీ కొందరు ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయలేదు. పలు కారణాలతో ప్రజలు ఈ కేవైసీని పూర్తి చేయలేకపోయారు. ఈ క్రమంలో ఇలాంటి వారికి కోసం ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఈ కేవైసీనీ చేసుకునేందుకు గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ గడువును జూన్ 30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు చేసింది. ఆ గడువు లోపు ఈకేవైసీని పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

కాగా.. బోగస్ కార్డులను ఏరివేయడంతో పాటు రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈ కేవైసీ ప్రక్రియను తీసుకువచ్చింది ప్రభుత్వం. అందులో భాగంగానే జనవరిలోనే ఈకేవైసీపీ ప్రక్రియను ప్రారంభించింది. ఈకేవీసీ పూర్తి చేసుకునేందుకు ఏప్రిల్ 30 వరకు గడువు విధిస్తూ.. ఆలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయని పక్షంలో రేషన్ సరుకులు నిలిపివేస్తామని అధికారులు ప్రకటనలు ఇచ్చారు. రేషన్‌కార్డులు ఉన్న వారు రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాల వద్దకు వెళ్లి ఈ కేవైసీ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అలాగే ఆన్‌లైన్‌లో కూడా ఈ కేవైసీని చేసుకునే విధానాన్ని కూడా అమలులోకి తీసుకొచ్చారు. అయితే కొన్ని కారణాల వల్ల చాలా మంది ఈకేవైసీని పూర్తి చేయలేకపోయారు. అలాంటి వారి కోసమే మరో రెండు నెలల పాటు గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది ఏపీ ప్రభుత్వం.

**కారణాలు ఇవే..**

ఆన్‌లైన్‌లో ఈకేవైసీని చేసుకునేందుకే చాలా మంది ముందుకు వచ్చారు. అయితే చాలా గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం సరిగా లేక ఇబ్బందులు పడ్డారు. దీంతో రేషన్ డీలర్లపైనే ఆధారపడాల్సి వచ్చింది. కానీ ఈకేవైసీ చేసేందుకు కొందరు రేషన్ డీలర్లు డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. అలాగే ప్రజలు వెళ్లే సమయానికి రేషన్ షాపులు క్లోజ్ అవడం కూడా ఒక కారణమనే చెప్పుకోవచ్చు. అంతే కాకుండా చాలా మంది విద్యార్థులు వేరే ప్రాంతాల్లో ఉంటూ చదువకోవడం వల్ల కూడా వారు ఈ కేవైసీని చేసుకోలేకపోయారు. ఈ సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి రావడంతో ఈకేవైసీ చేసుకునేందుకు గడువు పెంచాలని నిర్ణయించింది. అందులో భాగంగా జూన్ 30 వరకు ఈకేవైసీ చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది.

## పూడికతీత పనులు ప్రారంభం



**నాతవరం, (విశాఖ సమాచారమ్):-** నాతవరం మండలం లోని గాంధీనగరం పంచాయతీ లో తాండవ ఎడమ కాలువ వద్ద పూడికతీత పనులు తాండవ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కరక. సత్యనారాయణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, మాజీ డిసి ప్రెసిడెంట్ ఉలబాల అప్పలనాయుడు,డిసి ప్రెసిడెంట్ ఉలబాల బాపిరాజు,గ్రామ పార్టీ అధ్యక్షుడు కొత్త సత్యనారాయణ (సతీష్), టెక్నికల్ అసిస్టెంట్ అప్పారావు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆకట్టుకుంటున్న గ్రంధాలయ వేసవి శిక్షణ శిబిరం



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** నర్సీపట్నం శాఖ గ్రంధాలయం నందు చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం చిన్నారులను ఆకట్టుకుంటుంది . ఈ శిబిరంలో చిన్నారులు ఎంత ఉత్సాహంతో పాల్గొంటున్నారు. శనివారం శిబిరంలోగ్రంధాలయ అధికారిణి పి.దమయంతి కదలు చదివించి, నీతి కథలు వారికి వివరించారు. స్థానిక యువతి కృష్ణవేణి చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లీష్ లో భాగంగా పదాలు , వాటిని ఎలా ఉపయోగించాలో వివరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు బొమ్మలకు ఏ విధంగా రంగులు వేయాలో వేసి చూపించి డ్రాయింగ్ శిక్షణ నేర్పించారు. కాగా శనివారం వేసవి శిక్షణ శిబిరంలో 40 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## స్కాట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను అభినందించిన కలెక్టర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** తమిళనాడు రాష్ట్రం తిరుచ్చిలో జరిగిన జాతీయ స్థాయి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిబి రంలో పాల్గొన్న విద్యార్థులను జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అభినం దించారు. ఈ కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ కె. రత్నకుమారి, బేసిక్ గైడ్ కెప్టెన్ పి. ఈశ్వరి దేవి పాల్గొన్నారు.

## ఘనంగా సత్యనారాయణ స్వామి కళ్యాణోత్సవాలు



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఉత్తర వాహిని, బలిఘట్టం, నర్సిపట్నం(ము). నందు శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానము, అన్నవరం వారి దత్తత దేవాలయం శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి ఆలయం శ్రీ సత్యనారాయణ స్వామి వారి వార్షిక కళ్యాణోత్సవ కార్యక్రమాలు ఘనం గా నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం తో పాటు స్వామి వారు, అమ్మవార్లకు పంచామృతాభిషేకములు, అంకురారోపణ కార్యక్రమములు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారికి దివ్య కళ్యాణమహోత్సవము తదుపరి నీరాజన, మంత్రపుష్పములు,తీర్థ ప్రసాద వితరణ ఆలయ పూజారులు చేశారు. ఈ కార్యక్రమములు అన్నీ అన్నవరందేవస్థాన పండితులచే వారి ఆధ్వర్యములో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో రాష్ట శాసన సభాపతి సతీమణి శ్రీమతి చింతకాయల పద్మావతి, అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ వీర్ల సుబ్బారావు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అమృతేశ్వరనాట్య అకాడమీ వారిచే నాట్య ప్రదర్శన చేసి భక్తజనులు స్వామి వార్లను దర్శించి,తీర్థప్రసాదములను స్వీకరించారు.

## రాజవొమ్మంగిలో భారీ వర్షం - నేలకొరిగిన చెట్లు



**రాజవొమ్మంగి (అల్లూరి) :** మండలంలోని శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం వరకు తీవ్రమైన ఎండ కాయడంతోపాటు వడ గాల్పులకు తోడు, ఉక్క పోతతో అల్లాడిన మన్యవాసులు సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో నల్ల మబ్బులు కొమ్ముకొని ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం సుమారు గంటసేపు కురియడంతో ఉపశమనం పొందారు. ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న భారీ మామిడి వృక్షం వ్యవసాయ శాఖ కార్యాలయంపై పడిపోవడంతో కార్యాలయం తీవ్రంగా దెబ్బతింది. మామిడి, జీడి మామిడి కాయలు నేలరాలిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

2nd pages11.qxd 5/3/2025 7:41 PM Page 8



# క్రీడా సమాచారమ్

## పహల్గాం ఎఫెక్ట్.. ఆసియా కప్ కష్టమేనా?



**ఇంటర్నెట్ డెస్క్:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దేశమంతా ఆందోళన వ్యక్తమైంది. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పాకిస్థాన్ కీలక పాత్ర పోషించిందనే విమర్శలు వచ్చాయి. క్రీడా సంబంధాలపైనా ఆ ఎఫెక్ట్ పడనుందని.. క్రికెట్ సహా ఇతర క్రీడల్లో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడకూడదని ఇప్పటికే నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. క్రికెట్‌లోనూ ఇరు జట్ల మధ్య సిరీస్‌లు జరగడం లేదు. ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతున్నాయి. ఈ విషయంలో ఐసీసీ కూడా దృష్టిపెట్టాలని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వ్యాఖ్యానించారు. దీంతో ఆసియా కప్‌లోనూ భారత్ పాల్గొనడంపై ఇప్పుడు అనుమానాలు వెల్లువెత్తాయి. టోర్నీని వాయిదా వేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

"ఆసియా కప్ సాధారణంగా తటస్థ వేదిక పైనే నిర్వహిస్తున్నారు. ఈసారి ఇంకా షెడ్యూల్‌ను ప్రకటించలేదు. బంగ్లాదేశ్ సిరీస్ అనంతరం సెప్టెంబర్‌లో వేదికను నిర్ణయించే అవకాశం ఉంది. తాజా సమాచారం ప్రకారం ఆసియా కప్ వాయిదా పడే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత్ – పాక్‌ల మధ్య ఇప్పుడు సంబంధాలు సరిగ్గా లేవు. ఇలాంటి దశలో నిర్వహించే అవకాశాలు తక్కువే" అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

## అందుకే టీ20లకు వీడ్కోలు



**దిల్లీ:** 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన వెంటనే కెప్టెన్ రోహిత్‌శర్మతో పాటు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి కూడా ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఎందుకు టీ20ల నుంచి తప్పుకున్నానో మాత్రం చెప్పలేదు. చాలా నెలల తర్వాత కోహ్లి.. ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో ఇందుకు కారణాన్ని వెల్లడించాడు. వచ్చే టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని యువ క్రికెటర్లకు అవకాశం ఇవ్వడానికే తానీ నిర్ణయం తీసుకున్నట్లు అతడు తెలిపాడు. "టీ20ల్లోకి వచ్చేందుకు కొంతమంది యువ ఆటగాళ్లు వేచి చూస్తున్నారు. ఒత్తిడిని తట్టుకుంటూ, ప్రపంచంలో భిన్నమైన పిచ్‌లపై ఆడుతూ రాబోయే టీ20 ప్రపంచకప్ నాటికి రాటుదేలాలంటే.. యువ ఆటగాళ్లకు కనీసం రెండేళ్ల సమయం కావాలి. అప్పుడే వాళ్లు చాలినన్ని మ్యాచ్‌లు ఆడగలుగుతారు. ప్రపంచకప్‌కు సన్నద్ధం అవుతారు. అందుకే టీ20 ఫార్మాట్ నుంచి రిటైర్ కావాలని నిర్ణయించుకున్నా" అని విరాట్ తెలిపాడు. అంతర్జాతీయ టీ20లకు దూరమైనా.. ఐపీఎల్–18లో విరాట్ అదరగొడుతున్నాడు. బెంగళూరు తరఫున ఇప్పటిదాకా 10 మ్యాచ్‌ల్లో 63.29 సగటుతో 443 పరుగులు సాధించాడు.

## ఆ మాటే నా జీవితానికి పెద్ద మలుపు



వెండితెరను ఫలపుష్పాలతో అభిషేకించిన సినీ ముని... కె.రాఘవేంద్రరావు. పాటకి పట్టం కట్టి... గ్లామర్‌కి కొత్త సొగసులు అద్ది... తనకంటూ ఓ బ్రాండ్‌ని సృష్టించుకున్నారు. పోస్టర్‌పై ఆయన పేరు చాలు... ప్రేక్షకుడు థియేటర్‌వైపు అడుగులు వేయడానికి! అటు అగ్ర తారలతోనూ... ఇటు కొత్తతరం నటులతోనూ సినిమాలు తీసి బాక్సాఫీసుని కళకళలాడించిన ఘనత ఆయనది. యాభయ్యేళ్ల సినీ ప్రయాణంలో... పలు భాషల్లో 125కిపైగా సినిమాలకు దర్శకత్వం వహించారు. ఎంతోమంది నటుల్ని పరిచయం చేశారు, దర్శకుల్ని తీర్చిదిద్దారు. ఆయన సినిమాలతో వెలుగులోకి వచ్చిన సాంకేతిక నిపుణులు మరెంతోమంది. కె.రాఘవేంద్రరావు తొలి చిత్రం 'బాబు' విడుదలై మే 2తో యాభయ్యేళ్లు. ఇన్నేళ్ల ప్రయాణం తర్వాత కూడా ఆయనకి సినిమాపై ప్రేమ ఇంత కూడా తగ్గలేదు. సంగీతంపై ప్రేమతో ఇప్పుడు కీ బోర్డ్ నేర్చుకుంటున్నారు. మరోవైపు కలం చేతపట్టి పాటలు రాస్తున్నారు. 'సంగీతం అంటే నాకెంతో ఇష్టం. సంగీత దర్శకుడు కీరవాణితో ఉన్న అనుబంధంతో మరిన్ని విషయాల్ని తెలుసుకున్నా. ఆ ఇష్టంతోనే కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. గతంలో ఎస్వీబీసీ ఛానల్‌కి ఛైర్మన్‌గా నారా చంద్రబాబు నాయుడు అవకాశం ఇవ్వగానే 9 మంది సంగీత దర్శకులతో, 1108 అన్నమయ్య కీర్తనల గానంతో ప్రత్యేకంగా ఓ కార్యక్రమం చేయించా. ఆ ప్రయత్నం ఎంతోమంది మెప్పు పొందింది. ఇలా ప్రతి పనినీ ప్రేమతో, బాధ్యతతో చేయడం నాకు అలవాటు' అంటారు కె.రాఘవేంద్రరావు . యాభయ్యేళ్ల దర్శకత్వ ప్రయాణంపై ఆయనతో 'ఈనాడు సినిమా' ముచ్చటించింది. ఆ విషయాలివీ...

ఇన్నేళ్ల ప్రయాణాన్ని మీరు ఊహించారా? దర్శకుడిగా ప్రయాణం మొదలు కాక ముందు మీ ఆలోచనలు ఎలా ఉండేవి?

నాన్న కె.ఎస్.ప్రకాశరావు ప్రముఖ దర్శకుడు. ఆయన తీసిన సినిమాలు అప్పటికి అడ్వాన్స్‌డ్‌గా, మరో పదేళ్ల తర్వాత రావల్సినవి అన్నట్టుగా ఉండేవి. దాంతో కొన్ని సినిమాలు సరిగ్గా ఆడక బాగా నష్టపోయారు. ఆ తర్వాత మళ్లీ పుంజుకున్నారు అది వేరే విషయం. సహాయ దర్శకుడిగా నా ప్రయాణం మొదలయ్యాక... ఒకవేళ నేను దర్శకుడిని కాకపోతే బి.ఎ చదువుకు ఏం ఉద్యోగం వస్తుందా అని ఆలోచించేవాణ్ని. ఒకవేళ ఏ ఉద్యోగం రాకపోయినా, ఎలాగో డ్రైవింగ్ తెలుసు కదా, పెద్దవాళ్ల దగ్గర డ్రైవర్‌గా చేరిపోదాం అని ధైర్యం చెప్పుకునేవాణ్ని. అలా డ్రైవర్ కావాలనుకున్నవాణ్ని దర్శకుడినై 'డ్రైవర్ రాముడు' సినిమా తీశానన్నమాట (నవ్వుతూ).

యాభయ్యేళ్ల సుదీర్ఘ ప్రయాణం పూర్తి చేశారు. ఇప్పుడు మళ్లీ మీ తొలి సినిమా రోజుల్లోకి వెళదాం పదండి...

అప్పటికి నేను సహాయ దర్శకుడిని. మా నాన్న కె.ఎస్.ప్రకాశ్‌రావు దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేస్తున్నప్పుడు కథలు, సంగీత చర్చల్లో చురుకుగా పాల్గొనేవాణ్ని. నా పనితీరు నచ్చి నిర్మాత డి.రామానాయుడు దర్శకుడిగా అవకాశం ఇవ్వాలనుకున్నారు. ఇంకొంచెం అనుభవం ఉంటే బాగుంటుందని నాన్న చెప్పేవారు. చేస్తే కొత్త రకమైన సినిమానే చేయాలని నాకు ఉండేది. నా సన్నిహిత మిత్రులు కుమార్, శ్రీధర్, గోపాలకృష్ణ బాగా డబ్బున్నవాళ్లు. నాతో వాళ్లు సినిమా చేయాలనుకున్నారు. ముందుగా ఒక ఆర్ట్ సినిమా తీద్దాం, ఓ గ్రామానికి వెళ్లి రూ. లక్ష పెట్టుబడితో మొత్తం సినిమా పూర్తి చేసుకుని వచ్చేద్దాం అన్నాను. వాళ్లేమో తొలి సినిమానే భారీగా ఉండాలన్నారు. అప్పుడు మా నాన్న కథ ఇచ్చారు. ఆత్రేయ రచన, చక్రవర్తి సంగీతంతో మారుతి ప్రొడక్షన్స్ పతాకంపై 'బాబు' సినిమా మొదలైంది. కథానాయకుడు శోభన్‌బాబు బాగా బిజీగా ఉన్న రోజులవి. కానీ నాపై ఉన్న నమ్మకంతో సినిమాకి డేట్స్ ఇచ్చారు. ఓపెనింగ్ షాట్‌లోనే పైనుంచి బెలూన్స్ పడేలా ఏర్పాట్లు చేశాం. వచ్చిన అతిథులంతా ఆ సన్నివేశం చూసి అప్పట్లో ఆశ్చర్యపోయారు. జెమినీ స్టూడియోలో వంద మందితో లైవ్ ఆర్కెస్ట్రాతో పాటల రికార్డింగ్ మొదలైంది. విడుదల తర్వాత మంచి రిపోర్టే వచ్చింది.

ఎన్టీఆర్ లాంటి దిగ్గజ కథానాయకుడితో పాటు... నవతరంతోనూ సినిమాలు చేశారు. ఇన్ని తరాల కథానాయకుల్ని చూసిన అనుభవంతో ఓ దర్శకుడిగా మీరేం చెబుతారు?

నేను దర్శకత్వం చేస్తానంటే ఏ కథానాయకుడూ ఇప్పటిదాకా వద్దు అనలేదు. నాపైన వాళ్లకు ఉన్న నమ్మకం అది. ఇప్పుడంటే ట్రెండ్ మారడంతో మరీ ఎక్కువగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు కానీ... అప్పట్లో కథానాయకులు 30 నిమిషాలకి మించి కథ వినేవాళ్లు కాదు. ఎన్టీఆర్‌తో 12 సినిమాలు చేశాను కదా, మామధ్య 20 నిమిషాలే కథా చర్చలు సాగేవి. 'అడవి రాముడు' సినిమా ఆడకపోతే మళ్లీ అవకాశం వస్తుందో లేదో అని ఆ సినిమాలో నేను ఆయనతో ఏకలవ్యుడు, వాల్మీకితోపాటు రకరకాల గెటప్‌లు వేయించి తెరపై చూపించే ప్రయత్నం చేశా. ఆయన్ని రాముడిగా పోస్టర్స్‌లో చూడటమే తప్ప, ఎప్పుడూ కళ్లారా చూడలేదు కదా అని చివరి సన్నివేశం కోసం ఆయనతో రాముడి గెటప్ వేయించి చిత్రీకరణ చేశా. ఆ షాట్ పూర్తయ్యాక ఆయన పాదాలకి నమస్కారం చేశా. కారెక్కి వెళ్లిపోతూ 'నా జీవితంలో గుర్తుండిపోయే క్షణాలివి. తెరపై నన్నెలా చూపించాలో, నన్నెలా వాడుకోవాలో నీకు తెలిసినట్టు మరెవ్వరికీ తెలియదు' అన్నారు. చిరంజీవి, శోభన్‌బాబు, కృష్ణ... ఇలా అందరితో ప్రయాణం ఎంతో బాగుండేది. నేటితరం కథానాయకులతో సినిమాలు చేస్తున్నప్పుడు మరో రకమైన బాధ్యత. వాళ్లంతా ప్రముఖుల కుటుంబాల నుంచి వచ్చినవాళ్లు. వాళ్లు తెరకు పరిచయం అవుతున్నప్పుడు ప్రేక్షకులు అన్ని రకాల అంశాల్ని ఆశిస్తారు. అవి దృష్టిలో ఉంచుకుని సినిమాలు చేశా. వెంకటేశ్ మొదలుకొని, మహేశ్ బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్... ఇలా అందరితోనూ ప్రయాణం గుర్తుండిపోతుంది.

వాణిజ్య సినిమాకి కొత్త అర్థం చెప్పిన దర్శకులు మీరు. మీ సినిమాల్లో పాటలు, డ్రామా, గ్లామర్, హాస్యం అన్నీ ప్రత్యేకమే. ఈ శైలికి స్ఫూర్తి ఏమిటి?

చెబితే నమ్మరు కానీ... ఆరంభంలో నా ఆలోచనలన్నీ ఆర్ట్ సినిమా చుట్టూనే తిరిగేవి (నవ్వుతూ). 'అడవి రాముడు' సినిమానే నన్ను కమర్షియల్ దర్శకుడిగా మార్చేసింది. అప్పటికే ఒకొక్క దర్శకుడికీ ఒక్కో శైలి, బ్రాండ్ ఉండేది. ఆదుర్తి సుబ్బారావు పాటలు చాలా బాగా తీసేవారు. ఆయన పాటలంటే నాకు ఎంత ఇష్టమో. నా పాటలకి, వాటిలో గ్లామర్‌కీ ఆయనే స్ఫూర్తి అనుకోవచ్చు. కె.విశ్వనాథ్, కె.బాలచందర్ అన్నా నాకు ఎంతో ఇష్టం. వస్తున్న సినిమాలు ఎలా ఉన్నాయి? మనం కొత్తగా ఏం చేయగలం అనుకున్నప్పుడు వచ్చిన ఆలోచనలే నన్ను ఇటువైపు తీసుకొచ్చాయని నమ్ముతుంటా. సినిమాకి సంగీతం, డ్రామా ముఖ్యం అని భావిస్తా. ఒకవైపు పాటలు, మరోవైపు డ్రామా, రావు గోపాలరావు, రామలింగయ్యల కామెడీ, వీటికితోడు కొన్ని హృదయాన్ని హత్తుకునే అంశాల్ని జోడిస్తూనే మరోవైపు కథ చెప్పడం నా శైలి. కానీ నా సినిమాల్లో ఎంత డ్రామా ఉన్నా, పాటలే హైలెట్ అవుతుంటాయి (నవ్వుతూ).

బ్లాక్ అండ్ వైట్ కాలంలో ప్రయాణం మొదలు పెట్టిన మీరు... నేటి ఓటీటీ యుగంలోనూ అంతే ఉత్సాహంతో పని చేస్తున్నారు. మీరు ఎలా అప్‌డేట్ అవుతుంటారు?

సినిమానే నాకు ప్రపంచం. మంచి సినిమా ఎవరు తీసినా వాళ్లకు ఫోన్ చేసి అభినందిస్తూ, అందులో ఏ సన్నివేశాన్ని ఎలా తీశారో తెలుసుకుంటుంటా. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటా. ఆ ప్రయాణమే నన్ను అప్‌డేట్ చేస్తూ ఉంటుంది.

## మజ్జిగ చలివేంద్రం ప్రారంభం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** ఎండ వేడిమిని దృష్టిలో పెట్టుకుని జననేత ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి అన్నారు. జననేత పత్రిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుటెండలో ఆరోగ్యకరమైన ఔషధ గుణాలు కలిగిన మజ్జిగను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో వాతావరణ సమతుల్యానికి ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. మజ్జిగ చలివేంద్రం అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం నాడు జననేత పత్రిక సామాజిక సేవగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. పాత్రికేయులకు స్వేచ్ఛనివ్వడం ద్వారా సమాజంలో రుగ్మతలు తొలగి అభివృద్ధి సాధించడానికి వీలుపడుతుందన్నారు. ఓ పాత్రికేయునిగా సామాజిక సేవా దృక్పథంతో పత్రిక ఎడిటర్ దాసరి శివ కుమార్ రెడ్డి స్పందించడాన్ని ఆయన ప్రశంసించారు. జాతీయ రహదారి ప్రక్కన ఈ చలివేంద్రాన్ని పాదచారులు, వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జననేత సంపాదకులు దాసరి శివ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పత్రికను దిగ్విజయంగా నడుపుతున్న తాము సామాజిక సేవల పట్ల కూడా ఆసక్తి చూపుతున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగానే ప్రతీఏటా వేసవిలో 45 రోజులపాటు మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ ఔషధ గుణాలు గల మిశ్రమాలతో మజ్జిగను తయారు చేస్తున్నట్టు తెలిపారు. నగరంలో శాంతి భద్రతలను నెలకొల్పడంలో అత్యంత సమర్ధవంతంగా వ్యవహరిస్తున్న నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఈ మజ్జిగ చలివేంద్రం కార్యక్రమానికి హాజరు కావడం పట్ల శివకుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. అర్చకులు సంతోష్ శర్మ ఆశీర్వచనాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో జననేత పత్రిక న్యూస్ డెస్క్ ఇన్చార్జి డివిఎస్–ఎస్కే హరనాథ్, సిటీ టౌన్ రిపోర్టర్ ఎస్.నారాయణరావు, అడ్మినిస్ట్రేటివ్ ఇన్చార్జి ఉల్లాకుల గంగాధర్, పేజ్ డిజైనర్ ఆర్వి సంధ్య, ఫోటోగ్రాఫర్ వాకాడ చంద్రశేఖర్ రెడ్డి, స్వామ్నా ప్రధాన కార్యదర్శి మానాపురం కిషోర్, ఉపాధ్యక్షులు ఎస్. అరుణ్ కుమార్, కదలి ప్రసాద్, వేమన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు నీలాపు వివేకానంద రెడ్డి, అధ్యక్షులు, న్యాయవాదుల సంఘ మాజీ అధ్యక్షులు గొరుసు మహేశ్వర రెడ్డి, రిటైర్డ్ ఎమ్మార్వో సత్తి నాగేశ్వర రెడ్డి, పులగం సూర్యనారాయణ రెడ్డి, దల్లి రామకృష్ణా రెడ్డి, కర్రి రామా రెడ్డి, డివిఎస్ ప్రసాద్ రెడ్డి, ఈశ్వర రెడ్డి, కొయ్య వెంకటరమణా రెడ్డి, సంజీవ రెడ్డి, జీవీఎంసీ 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, 24వ వార్డు టీడీపీ ఇన్చార్జి బర్ల బాలకృష్ణ, ఎంవీపీ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సిబ్బంది నాగేశ్వరరావు, సురేష్, అచ్చి రాజేశ్వర రెడ్డి, యర్రాజి రెడ్డి, ధర్మేంద్ర రెడ్డి, మధు కిరణ్ రెడ్డి, జర్నలిస్టు సాయి సంతోష్ పట్నాయక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో అతిథులకు శ్రీ భూలోకమాత అమ్మవారి చిత్రపటాలను అందజేశారు.

## డాల్ఫిన్ నోస్ కాలనీని డివిజనల్ రైల్వే మేనేజర్ తనిఖీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** రైల్వే కాలనీలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు మరియు సౌకర్యాలను అంచనా వేయడానికి, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ఈరోజు (03.05.2025) డాల్ఫిన్ నోస్ కాలనీలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయనతో పాటు సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (ప్రధాన కార్యాలయం) శ్రీ జగదీష్, అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ శ్రీ అప్పారావు, ఎలక్ట్రికల్ మరియు సివిల్ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు మరియు గుర్తింపు పొందిన రైల్వే ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు ఉన్నారు.

ప్రాథమిక మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, లైటింగ్, భద్రత మరియు రైల్వే క్వార్టర్ల మొత్తం పరిస్థితిని సమీక్షించడంపై తనిఖీ దృష్టి సారించింది. అందుబాటులో ఉన్న సౌకర్యాలకు సంబంధించి అభిప్రాయాన్ని సేకరించడానికి %ణ=వీ% శ్రీ లలిత్ బోహ్రా నివాసితులతో సంభాషించారు. ఆయన అనేక ఇళ్లను కూడా తనిఖీ చేసి, వివిధ మార్పులు మరియు మెరుగుదల పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నివాసితులను ఉద్దేశించి %ణ=వీ% మాట్లాడుతూ, నివాసితుల శ్రేయస్సును అంచనా వేయడం, గృహాల పరిస్థితిని అర్థం చేసుకోవడం మరియు మెరుగుదల అవసరమైన ప్రాంతాలను గుర్తించడం తనిఖీ ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. కాలనీ నివాసితుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకొని పారిశుధ్యం, భద్రత మరియు మొత్తం జీవన నాణ్యతను పెంపొందించడానికి పరిపాలన యొక్క నిబద్ధతను ఆయన నొక్కి చెప్పారు. అన్ని రైల్వే కాలనీలలో ఇలాంటి తనిఖీలు నిర్వహించబడతాయని ఆయన తెలియజేశారు.

## 35, 42, 27 వార్డులలో వంశీకృష్ణ శ్రీనివాస్ పర్యటన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** 35 వ వార్డు వెలంపేట పోస్ట్ ఆఫీస్ వద్ద గత కొన్ని దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఇళ్ల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం వార్డులోని వేలంపేట విచ్చేసిన ఎమ్మెల్యే అక్కడ నివాసస్థులతో మాట్లాడారు. వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా ఇదే ప్రదేశంలో నివాసం ఉంటున్నామని అయితే ఇక్కడ ఇల్లు నిర్మిస్తామని చెప్పిన పాలకులు జీవీఎంసీ అధికారులు.. ఆ దిశగా చర్యలు చేపట్టలేదని ఎమ్మెల్యే ముందు వాపోయారు. దీంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో అక్కడే మాట్లాడారు. ఎన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నాయో ఆరా తీసిన ఆయన అందరికీ లబ్ధి చేకూరేలా ఇల్లు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులు సూచించారు. త్వరలో ఇళ్ల నిర్మాణం చేపట్టబోతున్నట్లు వంశీకృష్ణ శ్రీనివాస్ స్థానిక ప్రజలకు తెలియపరిచారు ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారికి ప్రశంసల జల్లు కురిపించారు.

అనంతరం 42 వార్డులో ఇంద్రానగర్ కాలనీలో స్థానిక ప్రజలతో మాట్లాడి త్వరలో నిర్మించబోయే ఇళ్ల నిర్మాణంపై అక్కడ నివాసితులతో చర్చించారు.ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రజలందరూ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు వేరొక చోట నివాసానికి ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. చివరిగా 27 వార్డులో వీటి కాలేజీ ఉన్న ప్రాంతంలో అధికారులు , జీవీఎంసీ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు .ఈ సందర్భంగా త్వరలో నిర్మించి బోయే గృహ నిర్మాణం పై స్థానిక కార్పొరేటర్, ప్రజలు, నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో జోన్ 4 కమిషనర్ మల్లయ్య నాయుడు, జోన్ 5 కమిషనర్ రాము గారు, జోన్ 3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ గారు, స్థానిక వార్డ్ కార్పొరేటర్ లు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, హౌసింగ్ ఈ ఈ శ్రీనివాస్ గారు, హౌసింగ్ ఏఈ లు, జీవీఎంసీ పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com